
SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక


వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e'mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : బుధవారం 16 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 207


## 45వేల ప్రభుత్వ స్కూళ్లను డిజిటలైజ్ : సీఎం



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం .. అన్నింటికి మించి పిల్లల చదువు పై ప్రత్యేక దృష్టి పెట్టారు. సంక్షేమ పథకాల్లో కూడా విద్యార్ధులకి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ వచ్చారు. అమ్మఒడి విద్యా దీవెన వసతి దీవెన .. వంటి పలు పథకాల్ని అమల్లోకి తీసుకువచ్చారు. అలాగే నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూల్స్ లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా అన్నింటికి మూలం చదువే అని జగన్ ప్రభుత్వం నమ్మి విద్యార్థులకి అన్ని విధాలా సహాయం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్కూళ్లకు సంబంధించి జగన్ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాదికి 45వేల ప్రభుత్వ స్కూళ్లను డిజిటలైజ్ చేయాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో పలు సంస్కరణల కోసం సీఎం అధికారులకు డెడ్ లైన్ విధించారని అందుకోసం అధికారులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని ఆదిమూలపు సురేష్ చెప్పారు. డిజిటలైజేషన్ లో ప్రైవేట్ స్కూళ్లతో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడబోతున్నాయని మంత్రి తెలిపారు. మొదటి దశలో భాగంగా 10వేల స్మార్ట్ టీవీలను స్కూళ్లలో అమర్చనున్నట్లు ఆయన తెలిపారు. దీనికోసం రూ.45 నుంచి రూ.50కోట్లు ఖర్చు చేయబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. కాగా ఇటీవల క్యాంపు ఆఫీసులో రివ్యూ మీటింగ్ లో మాట్లాడిన జగన్.. డిజిటల్ విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వ పాఠశాలల వైపు పిల్లలు తల్లిదండ్రులు చూసేలా మార్పులు చేయాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

## శుక్రగ్రహం మీద ఫాస్ఫైన్ ..

### సంచలన విషయాలు వెల్లడించిన శాస్త్రవేత్తలు !



ఈ సువిశాలమైన విశ్వం లో భూమి లాంటి గ్రహాలు ఇంకా ఏమైనా ఉన్నాయా ? భూమిపై కాకుండా ఎక్కడైనా జీవులు మనగల అవకాశం ఉందా అనే విషయం గురించి తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు కొన్నేళ్లుగా ప్రయోగాలు చేస్తుంటారు. అరుణ గ్రహం చంద్రుడి మీద జీవం మనగడకు గల అవకాశాలను తెలుసుకునేందుకు ప్రయోగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా వెల్లడైన కొన్ని కథనాలు శుక్రుడి మీద జీవం ఉండేందుకు ఆస్కారం ఉన్నట్లు చెప్తున్నాయి. ఇటీవల దీనిపై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు శుక్రగ్రహం పై కఠినమైన ఆమ్ల మేఘాలలో జీవుల ఉనికిని కనుగొన్నారు. పరిశోధకులు వాస్తవ జీవ రూపాలను కనుక్కోనప్పటికీ శుక్రగ్రహంపై ఫాస్ఫిన్ అనే జీవులు ఉన్నాయని ప్రాథమికం గా తేల్చారు. వాతావరణంలో అభివృద్ధి చెందుతున్న బ్యాక్టీరియా ద్వారా ఈ జీవులు ఉత్పత్తి అవుతున్నాయని గుర్తించారు. అంతర్జాతీయ శాస్త్రీయ బృందం మొదట హవాయి లోని జేమ్స్ క్లర్క్ మాక్స్ వెల్ టెలిస్కోప్ని ఉపయోగించి ఫాస్ఫిన్ ను గుర్తించింది. చిలీలోని అటాకామా లార్జ్ మిల్లీమీటర్ అర్రే రేడియో టెలిస్కోప్ ను ఉపయోగించి దీనిని ధృవీకరించింది. నేచర్ ఆస్ట్రానమీ ప్రచురించిన జర్నల్ లో ఈ ఆసక్తికర విషయాలు తెలిపారు. దీనిపై వేల్స్ లోని కార్డిఫ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఖగోళ శాస్త్రవేత్త జేన్ గ్రీవ్స్ మాట్లాడుతూ.. శుక్రగ్రహంపై జీవుల కదలిక చూసి నేను చాలా ఆశ్చర్య పోయాను. గ్రహాంతర జీవన ఉనికిపై ఎప్పటి నుండో సైన్స్ కు ఉన్న ముఖ్యమైన ప్రశ్నలలో ఒకటి అని అన్నారు. ఫాస్ఫిన్ –మూడు హైడ్రోజన్ అణువులతో కూడిన భాస్వరం అణువు– ప్రజలకు అత్యంత విషపూరితమైనది.

(మిగతా 8వ పేజీలో)


## అమరావతి భూ కుంభకోణంపై రంగంలోకి దిగిన ఏసీబీ



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. అప్పటికే ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతున్న ఏపీని తన చర్యలతో మరింత అప్పుల ఊబిలోకి నెడుతున్నారన్న విమర్శలను చంద్రబాబు పెడచెవిన పెట్టారని విపక్షాలు విమర్శలు గుప్పించాయి. పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ లో కొనసాగే అవకాశమున్నా కూడా....ఓటుకు నోటు కేసు నేపథ్యం లో హడావిడిగా ఏపీకి బాబు మకాం మార్చారని ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. ఇక స్వార్థ రాజకీయాలకు తెర లేపుతూ.అమరావతి రాజధాని పేరిట 33 వేల ఎకరాల భూ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించాయి. అమరావతిలో టీడీపీ హయాంలో జరిగిన భూ కుంభకోణం ఇన్ సైడర్ ట్రేడింగ్ పై విచారణ జరపాలని నాటి ప్రతిపక్ష వైసీపీ డిమాండ్ చేసింది. ఫలితంగా తాజాగా అమరావతి భూముల వ్యవహారంలో ఇన్ సైడర్ ట్రేడింగ్ పై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇన్సైడ్ ట్రేడింగ్ పై సమగ్ర దర్యాప్తునకు ఏసీబీ రంగ సిద్ధం చేసుకుంటోంది. ఈ వ్యవహారం లో ఇప్పటికే ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసిన ఏసీబీ...పూర్తి స్థాయిలో రంగంలోకి దిగింది. అమరావతిలో భూముల ఇన్ సైడర్ ట్రేడింగ్ పై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి వైసీపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించేలా కేంద్రంపై పార్లమెంటులో ఒత్తిడి తేవాలని వైసీపీ ఎంపీలు పావులు కదుపుతున్నారు. అమరావతి భూ కుంభకోణం నేపథ్యంలో సీఐడీ ఇటీవల ఇద్దరిని అరెస్టు చేసింది. భూ రికార్డుల తారుమారు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తుళ్లూరు రిటైర్డ్ తహసీల్దార్ సుధీర్బాబు దళితుల అసైన్డ్ భూములు అక్రమంగా కొన్న గుమ్మడి సురేష్ లను విచారణ జరుపుతున్నారు. సుధీర్ కు మాజీ సీఎం చంద్రబాబు తో సన్నిహిత సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. దీంతో పాటు ఈ వ్యవహారం లో ఇద్దరు మాజీ మంత్రుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అమరావతి ల్యాండ్ పూలింగ్లో అక్రమాలు తప్పుడు రికార్డుల సృష్టించిన నేపథ్యంలో సీఆర్డీఏ నెక్కల్లు డిప్యూటీ కలెక్టర్ కనికెళ్ల మాధురిని పోలీసులు గతంలోనే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ వ్యవహారం పై ఏసీబీ రంగం లోకి దిగడం తో మరింత మంది ప్రముఖుల పేర్లు బయటకు వస్తాయన్న ప్రచారం జరుగుతోంది.

## దుర్మార్గుల పాలనలో మంచివాళ్లకు కష్టాలు..

### అమరావతి భూములపై చంద్రబాబు



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ఏపీ మాజీ సీఎం, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ ప్రభుత్వ పాలన పై విరుచుకుపడ్డారు. టిడిపి సీనియర్ నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల తో బ్రతికే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు మాత్రమే కాకుండా జీవించే హక్కును కూడా హరిస్తున్నారని ఆయన ఏపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అమరావతి ల్యాండ్ స్కామ్..చంద్రబాబు, లోకేష్ లకు ఆ దమ్ముందా: మంత్రి అనీల్ సవాల్ రాజకీయ కక్షతోనే అమరావతి భూ కుంభకోణం ఆరోపణలు రాజకీయ కక్షతోనే అమరావతి భూ కుంభకోణం ఆరోపణలని పేర్కొన్నారు చంద్రబాబు. తెలుగుదేశం పార్టీపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడం కోసమే అమరావతి భూముల పై ఆరోపణలు చేస్తున్నారంటూ చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. తమ దోపిడీకి ఇదే చివరి అవకాశం అనే వైసిపి బరితెగిస్తున్నదని చంద్రబాబు విమర్శించారు. ప్రజల సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని, ఆ హద్దు కూడా దాటిపోయిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉంది వైసిపి దుర్మార్గాలపై ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర లోపు వైసీపీ సర్కార్ ఎన్ని తప్పులు చెయ్యాలో అన్ని తప్పులు చేసిందని అన్నారు. దుర్మార్గపు పాలనలో మంచి వాళ్ళు పడే కష్టాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే ఒక ఉదాహరణ అంటూ చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష పాత్ర అత్యంత కీలకమైంది అని చెప్పిన చంద్రబాబు, ప్రభుత్వ అవినీతిని ఎండగట్టే బాధ్యత ప్రతిపక్షానిదంటూ తెలిపారు. ఇక పార్టీలకతీతంగా పోలీసు వ్యవస్థ పని చేయాలని, ప్రతిపక్షాలను అణచివేయడానికి పోలీసులు పని చెయ్యటం మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వానివి ఒక చేత్తో ఇచ్చి ఇంకో చేత్తో లాక్కునే నిర్ణయాలు ప్రభుత్వం ఒక చేత్తో ఇచ్చి ఇంకొక చేత్తో లాక్కునే నిర్ణయాలు తీసుకుంటుందని సిఎన్జి పై పది శాతం పన్నుపెంచి ఆటో డ్రైవర్లపై భారం మోపాలని చంద్రబాబు విమర్శించారు. ఆటో డ్రైవర్లకు 10 వేలు ఇచ్చి 20,000 లాక్కోవడం హేయమని చంద్రబాబు మండిపడ్డారు.

పాఠకులకు విజ్ఞప్తి
www.vaartavali.com వెబ్సైట్లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## ఘోర రోడ్డు ప్రమాదం

**తాడిపత్రి :** జిల్లాలోని తాడిపత్రి శివారు వద్ద మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిరుచానూరు నుంచి తాడిపత్రికి వస్తున్న తుఫాన్ వాహనాన్ని గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందినవారు తాడిపత్రి వాసులేనని తేలింది. కాగా ప్రమాదంలో మృతి చెందిన వారు హేమలత, సుబ్రమణ్యం, వెంకట రంగయ్యగా గుర్తించారు.



విలేకరులు కావలెను
'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్చార్జ్లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
7032034001, 8500159006

## ప్రతి గిరిజన కుటుంబానికి రెండెకరాల భూమి

### ఐటీడీఏ పి.ఓ .డా.వెంకటేశ్వర్



**జి.కె.వీధి వార్తావళి, సెప్టెంబర్ 15 :**ఏజెన్సీలో భూమిలేని గిరిజన కుటుంబాలను గుర్తించి కనీసం రెండెకరాల భూమికి హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ సలిజామల స్పష్టం చేశారు. మంగళవారం జి.కె.వీధి మండలం దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండ ,కట్టుపల్లి సంకాడ పంచాయతీ చిన్న జాడమూరు గ్రామాల గిరిజన రైతులు సాగుచేస్తున్న అటవీ భూములను పరిశీలించారు. కాఫీ తోటల్లో పర్యటించి ఆర్వో ఎఫ్ ఆర్ భూముల్లో వేసిన సరిహద్దు రాళ్లను తనిఖీ చేశారు. కట్టుపల్లి గ్రామంలో కూడ సన్యాసిరావు, చిన్న జాడమూరు గ్రామంలో దేసగిరి యుగంధర్ కాఫీ తోటల్లో పర్యటించి భూముల్లో వేసిన సరిహద్దు రాళ్లను తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ కాఫీ, మిరియాలసాగు పై వస్తున్న దిగుబడి, ఆదాయాలను అడిగితెలుసుకున్నారు. కాఫీ రైతులకు కాఫీ పల్పర్ యంత్రాలను సరఫరా చేస్తామని చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, అంగన్వాడీ సేవలపై ఆరాతీశారు. రైతుభరోసా రైతులకు వచ్చిందాని ఆడిగితెలుసుకున్నారు. చిన జాడమూరు గ్రామంలో పర్యటించి దేశగిరి యుగంధర్ కాఫీ తోటలు పరిశీలించారు. కాపీరైతులకు పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఐటీడీఏ నుంచి పసుపు విత్తనాలు పొంది సాగు చేస్తున్న పసుపురైతు ఒలం బాబూరావు పసుపు తోటను సందర్శించారు. అనంతరం చాపరాతి పాలెం నుండి రాజేంద్రపాలెం వరకు రూ.785.40 లక్షలు వ్యయంతో పి.ఎం.జి.ఎస్ వై లో నిర్మిస్తున్న రోడ్ పనులను, పెదవలస గ్రామ పంచాయతీ, రైతు భరోసా కేంద్రం నిర్మాణపు పనులు తనిఖీ చేశారు. నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జి.కె.వీధి తహసీల్దార్, వి.రాజ్ కుమార్ ,పి.ఆర్ ఏ ఈ కె.జ్యోతిబాబు వి.ఆర్వో పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న తోటలో మంచంపై అమ్మాయి చదువు !



కూటి కోసం కోటి కష్టాలు అన్నది పాత సామేత ... కరోనా తప్పించుకుంటే చాలు అనేది కొత్త సామేత. ఈ కరోనా కాలంలో అందరికి అనేక ఇబ్బందులు ఎదురైయ్యాయి. ముఖ్యంగా విద్యార్ధులకి అన్ని సమస్యలే. ఆడుతూ పాడుతూ తోటి విద్యార్థులతో కలిసి పాఠశాలలో గడుపుతూ చదువుకునే అవకాశం లేకుండా చేసింది. అయితే ప్రభుత్వం విద్యా సంవత్సరం నష్టపోకుండా ఆన్ లైన్ తరగతులను ప్రారంభించింది. దూరదర్శన్ టిశాట్ ద్వారా తరగతులను బోధిస్తున్నారు. ఇప్పుడు ఇదే అందరికి పెద్ద సమస్యగా మారింది. వివరాల్లోకి వెళ్తే ... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో విద్యుత్ కోత ఒక సమస్య అయితే కొందరి వద్ద స్మార్ట్ ఫోన్ లేక మరికొందరు స్మార్ట్ ఫోన్ ఉన్నా సరైన సిగ్నల్స్ లేక ఆన్ లైన్ తరగతులను వినలేకపోతున్నారు. సెల్ సిగ్నల్ కోసం చెట్ల వెంట గుట్టల వెంట పరుగెడుతున్నారు. ఇదిలా ఉంటె నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా గ్రామంలోని ఓ విద్యార్థిని చేనులోని మంచె పై కూర్చొని ఆన్లైన్ లో క్లాసులు వింటుంది. అయితే ఆ గ్రామంలో గత కొన్ని రోజుల నుండి సెల్ టవర్ పనిచెయ్యడం లేదు. అయితే నిర్మల్ లో మైనారిటి గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న రాజూరా గ్రామానికి చెందిన సాఫా జరీనా అనే విద్యార్థిని ఇంటి దగ్గర ఫోన్ సిగ్నల్ రావడం లేదని ఊరు చివర్లో ఉన్న మొక్క జొన్న తోటలో మంచె పైన కూర్చొని ఆన్లైన్ లో క్లాసులు వింటుంది. పొలంలో ఉండే మంచెపై కూర్చుంటేనే సెల్ సిగ్నల్ వస్తోంది. దీనికోసం ప్రతి రోజూ తన తండ్రిని తీసుకొని మొక్క జొన్న తోటకు వచ్చి మంచె పైన కూర్చొని ఆన్ లైన్ లో క్లాసులు వింటుంది. ఊళ్లో సెల్ టవర్ సిగ్నల్ లేక ఆన్లైన్ క్లాస్లులకు ఇబ్బంది పడుతున్నమని విద్యార్థిని సాఫా జరీనా చెబుతోంది. కలెక్టర్ మంత్రి చొరవ తీసుకొని గ్రామానికి సెల్ సిగ్నల్ వచ్చేలా చేసి విద్యార్థుల ఇబ్బందులను దూరం చేయాలని కోరుతోంది. వ్యవసాయం చేసుకొని జీవనోపాధి పొందుతున్న తాను ప్రతి రోజు ఊరి చివర ఉన్న మొక్కజొన్న తోట వద్దకు కూతురును తీసుకువెళ్ళి తరగతులు అయిపోయే వరకు కాపాలా ఉండి తరగతులు ముగిసిన తర్వాత తీసుకు వస్తున్నానని షేక్ శాకీర్ కోరుతున్నాడు.

## టీడీపీ సీబీఐ విచారణ కోరాలి అంబటి వ్యాఖ్యలు



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 15 :**అమరావతిలో రాజధాని పేరుతో సాగిన భూముల కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు అమసరమని వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు తెలిపారు. అమరావతి కుంభకోణం దేశంలోనే అతిపెద్దదన్నారు. అమరావతి పెద్ద స్కామ్ అని తాము ముందునుంచి చెప్తున్నామని, బినామీ పేర్లతో 4 వేల 69 ఎకరాలు కొనుగోలు చేశారని రాంబాబు తెలిపారు.. ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోందని, త్వరలోనే ఈ భారీ కుంభకోణంలో ఆశ్చర్యకర విషయాలు బయటకి రాబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. చట్టాలను, బౌండరీలను మార్చి అక్రమాలకు పాల్పడ్డారని అంబటి తెలిపారు. రాజధాని భూముల స్కామ్పై సీబీఐ విచారణ వేయాలని కేంద్రాన్ని కోరామని, టీడీపీ తప్పు చెయ్యకపోతే సీబీఐ విచారణ కోరాలని అంబటి రాంబాబు సూచించారు. తప్పు చేశారు కనుకే చంద్రబాబు సీబీఐ విచారణ కోరడం లేదన్నారు. అలాగే ఫైబర్ గ్రిడ్ పేరుతో లోకేష్ బినామీలకు టెండర్లు ఇచ్చి 2 వేల కోట్ల స్కామ్కు పాల్పడ్డారని అంబటి తెలిపారు.. ఈ రెండు అంశాలపై బీజేపీ కూడా సీబీఐ విచారణ కోరాలన్నారు. ఈ రెండు కేసులూ తీవ్రమైనవని అంబటి పేర్కొన్నారు. వీటిపై సీబీఐ విచారణ తప్పనిసరన్నారు. 24 గంటల్లో సీబీఐ విచారణ కోరకపోతే తప్పు చేసినట్టేనని అంబటి వ్యాఖ్యానించారు.

## సొంత పరిశ్రమకే ద్రోహం



**ఢిల్లీ:** డ్రగ్స్ విషయంలో సినీ పరిశ్రమపై నిందలు వేస్తున్నారని, సొంత పరిశ్రమకే ద్రోహం చేస్తున్నారని, ఆ రంగానికి ప్రభుత్వ మద్దతు కావాలని రాజ్యసభలో ఈ రోజు ఎంపీ జయాబచ్చన్ కోరిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన హీరోయిన్ కంగనా రనౌత్.. జయా బచ్చన్పై మండిపడుతూ ట్వీట్ చేసింది.'జయా జీ.. నా స్థానంలో మీ కూతురు శ్వేత, సుశాంత్ సింగ్ రాజ్పుత్ స్థానంలో మీ కుమారుడు అభిషేక్ బచ్చన్ ఉంటే కూడా ఇలాగే మాట్లాడేవారా? మీ కూతురు శ్వేత టీనేజ్లో నాలా బాలీవుడ్లో దెబ్బలు తిని, డ్రగ్స్కు అలవాటుపడి, లైంగిక వేధింపులకు గురయితే ఇలాగే మాట్లాడతారా? సుశాంత్ సింగ్ రాజ్పుత్లా మీ కుమారుడు అభిషేక్ బచ్చన్ తరుచూ వేధింపుల గురించి ఫిర్యాదు చేసి, చివరకు ఆత్మహత్య చేసుకుంటే ఇలాగే వ్యాఖ్యలు చేస్తారా? మాపై కూడా కాస్త దయ చూపండి' అని కంగనా రనౌత్ మండిపడింది.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను.
యూ ట్యూబ్ చానల్లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu333@gmail.com
మెయిల్కి తమ బయోడాటా పంపించగలరు. 8500159006 నెంబరుకు సంప్రదించగలరు
YouTube

# జాతీయం- అంతర్జాతీయం

## చైనా కేబుల్ కుట్ర!



**లెహ్:** సరిహద్దుల్లో చైనా కొత్త కుట్రకు తెరలేపింది. పైకి చర్చలు, ఘర్షణ నివారణ చర్యలని నీతులు చెబుతున్నా అంతర్గతంగా మాత్రం సరిహద్దుల దగ్గర పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చే ప్రయత్నాలే చేస్తోంది. అంతేకాదు.. ఇప్పుడప్పుడే సరిహద్దుల నుంచి వైదొలిగే ప్రసక్తి లేదన్న సంకేతాలు పంపుతోంది. తాజాగా సరిహద్దుల వెంబడి భారీస్థాయిలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే పనిలో శరవేగంగా పావులు కదుపుతోంది. ఉద్రిక్తతలు అధికంగా ఉన్న పాంగాంగ్ సరస్సులోని దక్షిణ భాగం వరకు కేబుళ్లను వేసేందుకు భారీ ఎత్తున తవ్వకాలు ప్రారంభించింది. ఈ విషయాన్ని భారత సైనిక అధికారులు ధ్రువీకరిస్తున్నారు. దీనిపై రాయిటర్ వార్తా సంస్థ.. వివరణ కోరినా స్పందించేందుకు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ నిరాకరించింది. ఈ ఆందోళనకర పరిణామాన్ని భారత్ సునిశితంగా పరిశీలిస్తోంది. "వేగవంతమైన సమాచారం కోసం చైనా ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ వేయడం ఆందోళన కలిగిస్తోంది" అని ఓ భారత అధికారి చెప్పారు. పాంగాంగ్ సరస్సు దక్షిణ భాగాన కొన్ని ప్రాంతాల్లో భారత్- చైనా సైనికులు కేవలం కొన్ని వందల మీటర్ల దూరంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ భాగం వరకు కేబుళ్లు వేయడాన్ని భారత్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ కేబుళ్ల ద్వారా సరిహద్దుల్లోని దళాలకు వెనుకనున్న సైనిక స్థావరాల నుంచి సురక్షితమైన సమాచారం అందుతుంది. అంతేకాదు ఎప్పటికప్పుడు దృశ్యాలను, డాక్యుమెంట్లను పంపించుకోవచ్చు. "రేడియోలో మాట్లాడితే దొరికిపోవచ్చు. సంకేతాలను అడ్డుకోవచ్చు. ఆప్టికల్ ఫైబర్‌తో అలాంటి పరిస్థితి ఉండదు. సమాచారం సురక్షితంగా ఉంటుంది" అని ఆ అధికారి చెప్పారు.

**సరిహద్దు వద్ద ఉద్రిక్తంగానే..**

గత వారం భారత్-చైనా విదేశాంగ మంత్రులు సమావేశమైనా.. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. సరిహద్దుల్లో పరిస్థితి ఇప్పటికీ ఉద్రిక్తంగానే ఉంది. అయితే చైనా వైపు కొత్త దళాలు మోహరింపుల లేదని అధికారులు చెబుతున్నారు. చైనాతో నెలకొన్న వివాదంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం పార్లమెంటులో ఒక ప్రకటన చేసే అవకాశం ఉంది.

## ఐరాసలో చైనాను కాదని భారత్‌కు మద్దతు!

UN Commission on the Status of Women


**వాషింగ్టన్:** ఐక్యరాజ్య సమితిలో ఓ కీలక కమిటీలో భారత్ సభ్యత్వం సంపాదించింది. ఐరాసలోని 'ఎకానమిక్ అండ్ సోషల్ కౌన్సిల్'(ఈసీఓఎస్‌ఓసీ)కి చెందిన 'యూఎన్ కమిషన్ ఆన్ స్టేటస్ ఆఫ్ వుమెన్'లో సభ్యత్వం కోసం జరిగిన ఎన్నికల్లో చైనాను ఓడించింది. ఈ పోటీలో అఫ్గానిస్థాన్ సైతం బరిలో నిలిచింది. లింగ సమానత్వం, మహిళల సాధి కారిత కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ విజ యం గుర్తింపు వంటిదని ఐరాసలోని భారత శాశ్వత రాయబారి తిరుమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఓటింగ్‌లో భారత్‌కు మద్ద తుగా నిలిచిన సభ్యదేశాలన్నింటికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2025 వరకు భారత్‌కు ఈ కమిటీలో సభ్యత్వం ఉండనుంది. ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి భారత్ గెలుపొందగా.. అఫ్గానిస్థాన్ బ్యాలెట్ ఓట్లు సాధించి గౌరవాన్ని నిలబెట్టుకుంది. చైనాకు మాత్రం బ్యాలెట్‌కు కావాల్సిన ఓట్లలో సగం కూడా రాకపోవడం గమనార్హం. చైనా తన దుందుడుకు స్వభావంతో అంతర్జాతీయంగా మద్దతు కోల్పోతుందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

## ఆమె కసబ్‌ను గుర్తించింది.. కాస్త ఆదుకోండి!



**ముంబయి:** 26/11 ముంబయి ఉగ్రదాడులు. దేశమంతటినీ కుదిపేసిన విషయం. ఆ దాడుల్లో నేరస్థుడైన అజ్మల్ కసబ్‌ను పోలీసులు పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టగా.. దేవికా అనే తొమ్మిదేళ్ల బాలిక ధైర్య సాహసాలు ప్రదర్శించి అతడిని గుర్తించింది. అలాంటి బాలిక కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. వారిని ఆదుకోవాలని మహారాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే జీషాన్ సిద్ధిఖీ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన దేవిక ఇంటిని సందర్శించారు. ఆ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఆరా తీసిన విషయాన్ని ట్విటర్ వేదికగా వెల్లడించారు. '9ఏళ్ల వయసులోనే దేవికా రోటవాన్ ముంబయి ఉగ్రదాడుల్లో నేరస్థుడైన కసబ్‌ను న్యాయస్థానం ముందు గుర్తించింది. ఉగ్రవాదిని గుర్తించడంలో అంత చిన్న వయసులోనే దేవిక ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించింది. ప్రస్తుతం ఆమె కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం చేశా. దాడుల సమయంలో తనకు తగిలిన బుల్లెట్ గాయాలను దేవిక నాకు చూపించింది. ఆమె కథ నాకు ఎంతో ఆదర్శంగా అనిపించింది'అని ట్విటర్ వేదికగా వెల్లడించారు. మరో ట్వీట్‌లో మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్‌ఠాక్రేను ట్యాగ్ చేస్తూ..'దేవిక ఆ సమయంలో చూపిన ధైర్యానికి తనకు అవార్డు అందించాలి. అదేవిధంగా వారి కుటుంబానికి ప్రత్యేక కోటాలో ఇల్లు కూడా మంజూరు చేయాలని కోరుతున్నా. వారిని ఆదుకోవడం 'మహావికాస్ అఘాడీ' ప్రభుత్వానికి గొప్పదనం ఇస్తుంది'అని పేర్కొన్నారు. గతేడాది ఓ ఫేస్‌బుక్ పేజీలో దేవిక దాడుల విషయాన్ని ప్రస్తావిస్తూ.. తమకు ప్రభుత్వం కల్పిస్తామన్న సాయం ఇంకా అందలేదని చెప్పారు.

## ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం



**ఢిల్లీ:** దేశంలో అన్ని రకాల ఉల్లిపాయల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. తక్షణమే ఈ నిషేధం అమలులోకి వస్తుందని పేర్కొంటూ విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టీ) ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలో ఉల్లిపాయల లభ్యతను పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లో అధిక వర్షపాతం నమోదు కావడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడిందని, దీని ఫలితంగా నెలలోనే ఉల్లిధర మూడు రెట్లు పెరిగినట్టు పేర్కొంది. దక్షిణాసియా దేశాల వంటకాల్లో ప్రధానంగా వాడే ఉల్లిపాయల ఎగుమతిదారుల్లో భారత్ ప్రధానమైనది. బంగ్లాదేశ్, నేపాల్, మలేషియా, శ్రీలంక తదితర దేశాలు ఉల్లి కోసం భారత్‌పైనే ఆధారపడతాయి. దేశంలోనే అతిపెద్ద ఉల్లిపాయల వాణిజ్య కేంద్రమైన లాసల్‌గావ్‌లో నెల వ్యవధిలోనే టన్ను ఉల్లిధరలు మూడు రెట్లు పెరగడం గమనార్హం. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో టన్ను ధర రూ.30 వేలు పలుకుతోంది. దేశ రాజధాని నగరంలో ప్రస్తుతం కిలో ఉల్లిధర రూ.40గా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో అధిక వర్షపాతంతో వేసవిలో నాటిన ఉల్లి పంట దెబ్బతినడంతో పాటు మిగతా రాష్ట్రాల్లో కోత ఆలస్యమైందని ముంబయికి చెందిన ఉల్లి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు అజిత్ షా అన్నారు.

## నవంబర్ నాటికే చైనా వ్యాక్సిన్ సిద్ధం..! చైనా సీడీసీ నిపుణుల వెల్లడి



**బీజింగ్:** కరోనా వైరస్ మహమ్మారి ఎదుర్కోవడంలో భాగంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు వ్యాక్సిన్‌లు తుదిదశ ప్రయోగాల్లో ఉన్న విషయం తెలిసిందే. వీటిలో చైనా కంపెనీలు అభివృద్ధి చేసిన నాలుగు వ్యాక్సిన్‌లు తుదిదశ మానవ ప్రయోగాల్లో ఉన్నాయి. తాజాగా వీటిలో మూడు టీకాలు నవంబర్ నాటికి ప్రజా వినియోగానికి అందుబాటులోకి రావచ్చని చైనా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం(సీడీసీ) వెల్లడించింది. 'మూడోదశలో ఉన్న ఈ టీకా ప్రయోగాలు సాఫీగా సాగుతున్నాయి. ఇవి నవంబరు లేదా డిసెంబరు నాటికి సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది' అని చైనా సీడీసీ బయోసేఫ్టీ నిపుణులు గైఝెన్ వూ అక్కడి అధికారిక మీడియాలో పేర్కొన్నారు. గత ఏప్రిల్‌లో తాను కూడా వ్యాక్సిన్‌ను తీసుకున్నట్లు వెల్లడించిన గైఝెన్ వూ, ఇప్పటివరకు ఎలాంటి అసాధారణ లక్షణాలు కనిపించలేదని స్పష్టం చేశారు. అయితే, నాలుగు వ్యాక్సిన్‌లలో ఏ వ్యాక్సిన్‌ను తీసుకున్నారనే విషయాన్ని మాత్రం ఆమె తెలియజేయలేదు. చైనా జాతీయ ఫార్మా గ్రూప్(సినోఫార్మ్), సినోవాక్ బయోటెక్‌తో కలిసి మూడు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేశాయి. ఇప్పటికే వీటి ప్రయోగాలు చైనాతోపాటు యూఏఈలోనూ కొనసాగుతున్నాయి. మూడో దశ ప్రయోగాలు ముగిసిన తర్వాత ఈ ఏడాది చివరి నాటికే వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని సినోఫార్మ్ జులై నెలలోనే ప్రకటించింది. ఇక చైనాకు చెందిన కాన్‌సినో బయోలాజిక్స్ తయారుచేసిన మరో వ్యాక్సిన్ కూడా తుది దశ ప్రయోగాల్లో ఉండగా..ఇప్పటికే చైనా సైన్యం దీన్ని వినియోగించేందుకు జూన్‌లోనే అనుమతులు వచ్చాయి. కరోనా వ్యాక్సిన్ కోసం పలు దేశాలతోపాటు ఫార్మా కంపెనీలు కూడా పోటీపడుతున్న విషయం తెలిసిందే. ఈ సమయంలో వ్యాక్సిన్ కోసం కంపెనీలపై కొన్ని దేశాలు ఒత్తిడి తెస్తున్నాయనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా, యూరప్‌కు చెందిన తొమ్మిది వ్యాక్సిన్ అభివృద్ధి కంపెనీలు మాత్రం, శాస్త్రీయంగా క్లినికల్ ట్రయల్స్ పూర్తైన తర్వాతే వ్యాక్సిన్‌ను ప్రజా వినియోగానికి విడుదల చేయాలని ఈ మధ్యే ప్రతిజ్ఞ చేశాయి. ఈ సమయంలో చైనా వ్యాక్సిన్ నవంబర్, డిసెంబర్ నాటికే అందుబాటులోకి వస్తుందని చైనా సీడీసీ ప్రకటించడం ఆసక్తిగా మారింది.

**యూఏఈలో వాడకానికి అనుమతి..**

చైనా సినోఫార్మ్ తయారుచేసిన వ్యాక్సిన్ మూడోదశ ప్రయోగాలు యూఏఈలో జరుగుతున్నాయి. గత ఆరు వారాలుగా అక్కడి ప్రయోగాలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలోనే, కరోనా పోరులో ముందువరుసలో ఉన్న వారికి ఈ వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి యూఏఈ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని అక్కడి జాతీయ విపత్తు నిర్వహణ విభాగం ట్విటర్‌లో వెల్లడించింది. తొలి రెండుదశల ప్రయోగ ఫలితాలు సురక్షితంగా ఉండడంతోపాటు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తేలడంతోనే వీటికి అత్యవసర వినియోగానికి అనుమతి ఇచ్చినట్లు అక్కడి ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటికే సినోఫార్మ్ అభివృద్ధిచేసిన వ్యాక్సిన్ ప్రయోగాల్లో దాదాపు 31వేల మంది వాలంటీర్లు పాల్గొన్నట్లు సమాచారం.

## పొరపాటుగా చొరబాటు.. అదీ మూడుసార్లు




**లీచెన్‌స్టైన్..** యూరప్‌లో ఓ చిన్న దేశం. 62 చదరపు మైళ్ల విస్తీర్ణం. అతి తక్కువ జనాభా. ప్రపంచంలోని సంపన్న దేశాల్లో ఒకటి. ఇక్కడ నేరాలు సంఖ్య చాలా తక్కువ. సొంత సైన్యం కూడా లేదు. ఇతర దేశాలతో లీచెన్‌స్టైన్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. అలాంటి దేశంలోకి పొరుగున ఉన్న స్విట్జర్లాండ్ గతంలో మూడు సార్లు చొరబడింది. అయితే అవన్నీ పొరపాటుగా జరగడం విశేషం.

**క్షిపణి ప్రయోగం.. అడవి దగ్ధం**

1985 డిసెంబర్ 5న స్విట్జర్లాండ్ క్షిపణులను ప్రయోగించడంలో సైనికులకు శిక్షణ ఇచ్చింది. ఈ క్రమంలో సైన్యం ఓ క్షిపణిని పొరపాటున లీచెన్‌స్టైన్‌లోని ఓ అటవీ ప్రాంతంపై ప్రయోగించింది. దీంతో అక్కడ భారీ అగ్ని ప్రమాదం జరిగి.. అడవి మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనపై లీచెన్‌స్టైన్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. పొరపాటుకు స్విట్జర్లాండ్ భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించింది. 1992 అక్టోబర్ 13న ట్రీసెన్‌బర్గ్‌లో సైనిక శిబిరం ఏర్పాటు చేయాలని సైన్యానికి స్విట్జర్లాండ్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో సైనికులు భారీగా ఆయుధాలతో అక్కడి చేరు కొని సైనిక శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నిజానికి ట్రీసెన్ బర్గ్ ప్రాంతం లీచెన్‌స్టైన్ పరిధిలోకి వస్తుంది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన స్విట్జర్లాండ్ ప్రభుత్వం లీచెన్‌స్టైన్‌కి క్షమాపణ చెప్పి సైన్యాన్ని వెనక్కి పిలుపించుకుంది.

**దారి తప్పి.. క్షమాపణ చెప్పి**

2007 మార్చి 1న మూడోసారి చొరబాటు జరిగింది. స్విట్జర్లాండ్‌కు చెందిన 171 మంది సైనికుల బృందం వారి శిబిరం వైపు వెళుతుండగా.. ప్రతికూల వాతావరణం, భారీ వర్షం కారణంగా పొరపాటున దేశ సరిహద్దు దాటి లీచెన్‌స్టైన్‌లోకి అడుగుపెట్టారు. ఆ దేశంలో రెండు కిలో మీటర్ల దూరం ప్రయాణించిన తర్వాత వారి పొరపాటు తెలుసుకొని తిరిగి వెనక్కి వచ్చారు. అయితే లీచెన్‌స్టైన్ ప్రభుత్వానికి సైనికులు చొరబాటు గురించి స్విట్జర్లాండ్ చెప్పేవరకు తెలియదట. పొరపాటుకు మన్నించాలని స్విట్జర్లాండ్ క్షమాపణ కోరగా.. "ఇదేమీ దండయాత్ర కాదుగా.. ఫర్వాలేదు, అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతుంటాయి' అని లీచెన్‌స్టైన్ ప్రభుత్వ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.

## అబె వారసుడిగా యోషిహిదే సుగా!



**టోక్యో:** జపాన్ తదుపరి ప్రధానిగా ఆ దేశ క్యాబినెట్ ముఖ్య కార్యదర్శి యోషిహిదే సుగా(71) పదవీ బాధ్యతలు స్వీకరించడం లాంఛనమైంది. అధికార లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ(ఎల్‌డీపీ) అధినేత ఎన్నిక కోసం జరిగిన ఎన్నికల్లో ఆయన తిరుగులేని మెజార్టీ సాధించారు. బుధవారం జపాన్ పార్లమెంట్ డైట్‌లో జరిగే ఓటింగ్ అనంతరం ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తారు. సుగా ప్రస్తుత ప్రధాని షింజో అబెకు సహాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ముఖ్య అనుచరుడిగా వ్యవహరించారు. కరోనా వైరస్ క్లిష్టకాలం, పలు విధాన నిర్ణయాలు అమలుపర్చాల్సిన తరుణంలో సుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రపంచమంతా ఆర్థికంగా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జపాన్‌ను ముందుకు నడిపే బాధ్యత సుగాపై ఉంది. అబె చేపట్టిన అనేక సంస్కరణల వెనుక సుగా హస్తం ఉన్నట్లు చెబుతుంటారు. సుగాను ఎన్నుకోవడం ద్వారా అబె విధానాలకు ఎల్‌డీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లైంది. అమెరికాతో సఖ్యత, భారత్‌తో మైత్రి, బ్యాంక్ ఆఫ్ జపాన్ ఉద్దీపనలు అమలు పరచడం వంటి విధానాల్లో పెద్దగా మార్పు ఉండే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. అనారోగ్యం కారణంగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రస్తుత ప్రధాని షింజో అబె ప్రకటించిన విషయం తెలిసిందే. తాను కొంతకాలంగా పెద్దపేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. జపాన్ చరిత్రలో అత్యంత ఎక్కువకాలం పాలించిన ప్రధానిగా అబె ఖ్యాతి గడించారు. ఏడాది పాటు పదవీకాలం మిగిలుండగానే రాజీనామాకు సిద్ధమయ్యారు.

## 'ఉమర్ ఖలీద్‌ను ఉరి తీయడం ఖాయం'



**న్యూఢిల్లీ:** వివాదాస్పద బీజేపీ నేత కపిల్ మిశ్రా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో జేఎన్‌యూ విద్యార్థి నేత, ఉమర్ ఖలీద్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఢిల్లీ పోలీసులను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాదు ఉమర్, తాహిర్ హుస్సేన్ వంటి నేరస్థులను ఉరితీయడం ఖాయమని తాను పూర్తిగా నమ్ముతున్నానంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు కపిల్ మిశ్రా వీడియో మెసేజ్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఫిబ్రవరి 2020 లో ఢిల్లీలో జరిగిన హింస ముంబై 26/11ఉగ్రవాద దాడికి సమానమని మిశ్రా పేర్కొన్నారు. ఢిల్లీలో ఒక పథకం ప్రకారం జరిగిన పెద్ద కుట్ర అని, హింసాత్మకు అల్లర్లకు, దాడులకు ఉమర్, తాహిర్, తదితరులు ప్రయత్నించారనీ, దుకాణాలను తగుల బెట్టి, ప్రజలను మట్టుపెట్టేందుకు చూశారని ఆరోపించారు. ఇలాంటి ఉగ్రవాదులను జీవిత ఖైదు చేసి, ఉరితీస్తారన్నారు. ఢిల్లీ పౌరులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. కాగా పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా నిరసనోద్యమం సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్‌ను ఉపా చట్టం కింద ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇతనిపై గతంలోనే ఎఫ్ఐఆర్ నమోదైంది.

## భారత్‌లో 80వేలు దాటిన కరోనా మరణాలు!



**ఢిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి ఉద్ధృతి కొనసాగుతూనే ఉంది. అయితే, గత రెండురోజులుగా రోజువారీ కేసుల సంఖ్య కాస్త తగ్గింది. నిన్న దేశవ్యాప్తంగా 10,72,845 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా వీటిలో 83,808 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. దీంతో మంగళవారం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 49,30,236కు చేరింది. వీరిలో ఇప్పటికే 38లక్షల మంది కోలుకోగా మరో 9లక్షల 90వేల క్రియాశీల కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక దేశంలో కరోనా మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. నిన్న ఒక్కరోజే మరో 1054 మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో ఇప్పటి వరకు కరోనా సోకి మృతిచెందిన వారిసంఖ్య 80,776కి చేరింది. అయితే, కొవిడ్-19తో మరణిస్తున్న వారిలో దాదాపు 70శాతానికి పైగా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారేనని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టంచేస్తోంది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 78శాతానికి చేరడం కాస్త ఉపశమనం కలిగించే విషయం. మరణాల రేటు మాత్రం 1.64శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. ఇక దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 5కోట్ల 83లక్షల శాంపిళ్లకు కొవిడ్ టెస్టులు పూర్తిచేసినట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) వెల్లడించింది. ఇదిలాఉంటే, ప్రపంచంలో కొవిడ్-19 తీవ్రత అధికంగా ఉన్న అమెరికాలో దీనిప్రభావం కొనసాగుతూనే ఉంది. అయితే, జులైలో అక్కడ నిత్యం 70వేలకుపైగా కేసులు బయటపడగా ఇప్పుడు ఆ సంఖ్య 35వేలకు చేరింది. అమెరికా వ్యాప్తంగా కొవిడ్ తీవ్రత కాస్త తగ్గినట్లు కనిపిస్తున్నప్పటికీ.. ఏడు రాష్ట్రాల్లో మాత్రం వైరస్ తీవ్రత అధికంగా ఉన్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. ఇక కరోనా మరణాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, బ్రెజిల్, భారత్‌లు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## సెంట్రల్ జైలుకు నటి రాగిణి



**బెంగళూరు :** శాండల్‌వుడ్ డ్రగ్స్ వ్యవహారంలో అరెస్టయిన ప్రముఖ కన్నడ నటి రాగిణి ద్వివేదికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆమెను బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు తరలించారు. మరో నటి సంజన గల్రాని, రాహుల్, ప్రశాంత్ రంకా, లూమ్ పెప్పర్, నియాజ్‌లను వీడియో కాన్ఫరెన్స్‌లో కోర్టులో హాజరు పరిచారు. సంజనకు మినహా మిగతా వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. నటి సంజనకు 16వ తేదీ వరకు సీసీబీ కస్టడీని పొడిగించారు. సంజనను మరింతగా ప్రశ్నించాల్సి ఉన్నందున కస్టడీని పొడిగించినట్లు సీసీబీ పోలీసులు తెలిపారు. రాగిణితో పాటు 14 మంది నిందితులపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద కేసులు నమోదు చేయడంతో ఇప్పట్లో బెయిల్ దొరకటం కష్టమని తెలిసింది. మరో నటి సంజనను విచారణకు సహకరించటంలేదని సీసీబీ పేర్కొనగా, మరో 2 రోజుల పాటు వారి కస్టడీకి అనుమ తించడంతో మంగళ, బుధవారాలు ప్రశ్నించనున్నారు. అంతకుముందు నిందితులకు కేసీ జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ టెస్టులను, ఇతర వైద్య పరీక్షలను చేయించారు. రాగిణి, సంజనలకు కరోనా నెగిటివ్‌గా వచ్చింది. డ్రగ్స్ కేసులో కాంగ్రెస్ బీబీఎంపీ కార్పొరేటర్ కేశవమూర్తి కొడుకు యశస్ కోసం ఎన్‌సీబీ పోలీసులు ముంబై నుంచి బెంగళూరుకు వచ్చి గాలిస్తున్నారు. ఈ నెల 7న విచారణకు పిలవగా ఒకసారి వచ్చి వెళ్లాడు. తరువాత విచారణకు పిలవగా అదృశ్యమయ్యాడు.




## వైయస్సార్ ఆసరా పథకం మహిళలకు వరం



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** వైయస్సార్ ఆసరా పథకం మహిళలకు వరం లాంటిదని, మహిళా సాధికారత సాధ్యం అవుతుందని లక్ష్యంతో సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి అన్నారు. వైయస్సార్ ఆసరా వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని పూల్ బాగ్ కాలనీ నాలుగో డివిజన్‌లో మరియు 38,40 వార్డులకు సంబంధించి గాజులరేగలో ఏర్పాటుచేసిన వారోత్సవాల సంబరాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పొదుపు సంఘాల సభ్యుల హర్షాతిరేకాలు మధ్య కేక్ కట్ చేసి, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల సభ్యులు ఉత్సాహంతో వేసిన ముగ్గులను కూడా కోలగట్ల శ్రావణి పరిశీలించి మహిళలను అభినందించారు.

## పట్టాల పంపిణీకి సిద్ధం కావాలి

### ఐ.టి.డి.ఏ, ప్రాజెక్ట్ అధికారి కూర్మనాథ్



**మక్కువ, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ఆడవిమీద, అడవి సంపద మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు ఆడవిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తారు, వారికి ప్రభుత్వం అందిస్తున్న అభివృధ్ధి సంక్షేమ కార్యక్రమాలు సత్వరం అందించేలా విధులు నిర్వహించాలి అని ప్రాజెక్ట్ అధికారి ఆర్. కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాజెక్ట్ అధికారి తన పర్యటనలో భాగంగా మక్కువ మండలం పర్యటించారు. మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో ఆర్. ఓ.ఎఫ్.ఆర్ భూమి పట్టాల పంపిణీ నిమిత్తం చేపడుతున్న పనులను సమీక్షించారు, అనంతరం ఆర్. ఓ.ఎఫ్.ఆర్ కి సంబందించిన రిజిస్టర్లు పరిశీలించి హద్దు రాళ్ళు నాటిన భూముల వివరాలు, ఫోటో వెంటనే సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం మక్కువ మండలం వెంకట భైరిపురం, పార్వతీపురం డి.కె.పట్నం గ్రామల సచివాలయాలను సందర్శించి సచివాలయం అందిస్తున్న సేవలు, సిబ్బంది నిర్వహిస్తున్న పనుల వివరాలపై సమీక్షించారు, వారు నిర్వహిస్తున్న రిజిస్టర్‌లు పరిశీలించి నిర్వహిస్తున్న పనుల పని తీరుపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలు వారు కోరే సమాచారం వెంటనే అందించాలని, అలాగే సంబంధిత రిజిస్టర్ లు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గ్రామ సచివాలయంలో సిబ్బంది బయోమెట్రిక్ తప్పని సరి అన్నారు. ఈ పర్యటనలో వెలుగు ఏ.పి.డి, మక్కువ ప్రత్యేక అధికారి సావిత్రమ్మ, మక్కువ మండలం తహశీల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వి.ఆర్.ఓ లు ఇతర రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సుందరీకరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లా కలెక్టర్ డా.హరిజవహర్ లాల్ పిలుపు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ఇల్లు, పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లా అంతటా సంపూర్ణ పారిశుధ్ద్యంతో, పచ్చని చెట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దుకోవా లనే ఒక ఉన్నత ఆశయంతో సుందరీకరణ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ అన్నారు. ఇందు లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంజనీర్స్ డే సందర్భంగా గ్రామీణ నీటిసరఫరా కార్యాలయం ఆవరణను పరిశుభ్రంగా రూపొందించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ డా.ఎం. హరిజవహర్ లాల్ ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు దాదాపు మూడు గంటలపాటు ఈ కార్యాలయం ఆవరణలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజనీర్లతో కలిసి స్వచ్ఛసేవలో పాల్గొన్నారు. తానే స్వయంగా ఆవరణలోని విషపూరిత మొక్కలు, పిచ్చి మొక్కలను తొలగించి ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా ఇంజనీర్లు, ప్రభుత్వ సిబ్బందిలో స్ఫూర్తినింపారు. నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించే బాధ్యతను సిబ్బంది తీసుకోవాలని సూచించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా స్వర్గీయ డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను తెలియజేసి, ప్రతి ఇంజనీర్ డా.విశ్వేశ్వ రయ్యను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాల న్నారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్.ఇ. పప్పు రవి, పంచాయతీరాజ్ ఎస్.ఇ. పి.విజ యకుమార్, గ్రామీణ నీటిసరఫరా ఇ.ఇ. కె.వి.శివానందకుమార్ తదితరులు డా.విశ్వే శ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న తోడు దరఖాస్తుల పరిశీలన చేయాలి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** జగనన్న తోడు దరఖాస్తులు త్వరితగతిన పరిశీలించాలని గ్రామ, వార్డు సచివాలయాలు, అభివృద్ధి విభాగం సంయుక్త కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అన్నారు. జగనన్న తోడు, వై,యస్.ఆర్ బీమా పథకాలపై జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. జిల్లాలో జగనన్న తోడు పథకానికి 34,552 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంబంధిత బ్యాంకులకు పంపిస్తారని చెప్పారు. బ్యాంకులు వారం రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న తోడు, ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల పథకం (పి.యం. స్ట్రీట్ వెండార్స్ ఆత్మనిర్భర్ నిధి) క్రింద చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డు జారీ చేయడమే కాకుండా సున్నా వడ్డీకి రూ.10 వేలు రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3 శాతం చొప్పున వడ్డీని చెల్లిస్తాయని వివరించారు. అక్టోబరు 4వ తేదీన జగనన్న తోడు కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశం ఉందని సంయుక్త కలెక్టర్ చెప్పారు. బ్యాంకులు సత్వరం ఈ ప్రక్రియను పూర్తి చేసి సహకారాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకానికి ప్రాధాన్యతను ఇస్తూ చిరు వ్యాపారులకు తోడుగా ఉండాలని సంకల్పించాయని చెప్పారు. జిల్లాలో బియ్యం కార్డు ఉన్న వారందరూ అర్హులేనని ఆయన పేర్కొన్నారు. వై.యస్.ఆర్ బీమా ప్రీమియంగా పేదల తరపున ప్రభు త్వమే 15 రూపాయలు చెల్లిస్తుందని ఆయన చెప్పారు. జిల్లాలో గతంలో భారీ ఎత్తున జన్ ధన్ ఖాతాలను ప్రారంభించడం జరిగిందని ఆ ఖాతాల పరిస్థితిని పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ బి.నగేష్, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఎం.కిరణ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ జి.వి.బి.డి.హరి ప్రసాద్, డిసిసిబి డిజిఎం ప్రసాద్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



గ్రామీణ నీటి సరఫరా కార్యాలయ ఆవరణలో వృధా మొక్కలు, పర్యావరణానికి హాని కలిగించే మొక్కలు స్వయంగా తొలగిస్తున్న విజయనగరం జిల్లా కలెక్టర్ డా ఎం. హరిజవహర్ లాల్.
– వార్తావళి, పార్వతీపురం



శ్రీ పైడిమాంబ తల్లి అమ్మవారి ఆలయంలో చండీ యాగం చేస్తున్న వేద పాండిత్యముతో రాజెష్,మరికొంత మంది అర్చకులు. – వార్తావళి, పార్వతీపురం

## ఇంజనీర్లకు ఆదర్శమూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

### డి.ఈ.ఈ.వెంకటరావు, దివాకర్



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** దేశంలో నేటితరం ఇంజనీర్లకు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యా ఆదర్శముర్తి గానే కాకుండా స్ఫూర్తితో గుండెల్లో ఉండిపోతారని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.వి.ఎన్.వెంకటరావు అన్నారు, మంగళవారం అట్టడ బీఎన్ఆర్ ఆశ్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి తో పాటుగా ఇంజనీర్స్‌డేని ఘనంగా నిర్వహించారు,మోక్షగుండం చిత్రపటానికి జ్యోతి వెలిగించిన అనంతరం ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటరావు మాట్లాడుతూ మానవాళికి మోక్షగుండం చేసిన మేలు మారువలేమని మహా అద్భుతాలు చేసి ప్రపంచం నివ్వెరపోయేలా జల నియంత్రణలో అద్భుతాలు సృష్టించిన గొప్ప వ్యక్తి మోక్షగుండం మాత్రమేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి కృష్ణ,గురువులు,దాలినాయుడు, రాయి పద్మావతి,కోరుకొండ బుజ్జి,తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం జిల్లా జీయ్యమ్మవలస మండల్లో ఒక వ్యక్తి వద్ద సెప్టెంబర్ 15న 50 నాటు సారా పేకెట్లు కలిగి యుండగా, జియ్యమ్మవలస పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. – వార్తావళి, జియ్యమ్మవలస

## 19న వ్యక్తిత్వ వికాసంపై ఉచిత ఆన్ లైన్ శిక్షణా తరగతులు

### సెట్విజ్ సిఇఓ నాగేశ్వరరావు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** యువతకు వ్యక్తిత్వ వికాసంపై ఈనెల 19వ తేదీన ఉదయం 10.00 నుండి 11.30 గంటల వరకు ఉచిత ఆన్ లైన్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ ముఖ్య కార్య నిర్వహణాధికారి పి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ, రామకృష్ణ మఠం, స్వామి సేవియానంద వారు మోరల్, ఎథికల్ వేల్యూస్, కేరక్టర్ బిల్డింగ్, యువత నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై వివరించడం జరుగుతుందన్నారు. 15 నుండి 35 సం.లు వయస్సు గల యువత రిజిస్ట్రేషన్ కోసం http://tiny.cc/personalitydevelopmen ఉపయోగించుకొని ఐడి, పాస్ వర్డ్ పొందిన తర్వాత ఆన్ లైన్ తరగతులకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 7396219578ను సంప్రదించా లన్నారు. యువతీ, యువకులకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక శ్రద్ధతో రూపొందించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

## విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి




**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయి అన్నారు. విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు ఉత్తరాంధ్ర అభివృద్ధి విషయంలో ఇప్పటికే ఎన్నో సభలు సమావేశాలు నిర్వహించామన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలన్నారు గిరిజన యూనివర్సిటీని పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రయత్నం చేయాలన్నారు గిరిజనులు ఉన్న ప్రాంతాన్ని గిరిజన జిల్లాగా ప్రకటిస్తే వారికి కొంత మేలు కలిగే అవకాశం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక నూతన పాలసీ ద్వారా ఉపాధి కోల్పోయారన్నారు జిల్లాలో ఉన్న యూత్ పరిశ్రమలన్నీ తెరిపించేందుకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు అశోక్ అలమండ ఆనందరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి కృష్ణంరాజు, ఆల్తి అప్పలనాయుడు, ఎస్ రామచంద్రరావు, ఆర్ వి ఎస్ కుమార్ ,మద్ది మాణిక్యం, మద్ది కృష్ణ, తుమ్మి అప్పలరాజు దొర ఎస్ రంగరాజు టి జీవన్ పాల్గొన్నారు.

## కోవిడ్ వ్యాధిగ్రస్తుల కాంట్రాక్ట్ ట్రేసింగులో మొదటిస్థానంలో జిల్లా

### జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** కోవిడ్ నియంత్రణలో భాగంగా ఈ వ్యాధికి గురైన వారితో సమీపంలో వున్న వారు వారితో సంబంధం కలిగి వున్న వారిని గుర్తించడంలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో వుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఈనెల 15వ తేదీ ఉదయం 9.30 గంటలకు విడుదల తాజా ర్యాంకింగ్ లో కాంట్రాక్టు ట్రేసింగులో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. పాజిటివ్ కు గురైన వారితో వున్న ప్రాథమిక కాంటాక్టు గల వ్యక్తులు, సెకండరీ కాంటాక్టు గల వ్యక్తులను గుర్తించడంలో ఏ ఒక్కటీ పెండింగులో లేకుండా శతశాతం గుర్తింపుతో రాష్ట్రంలో టాప్ లో వున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నట్టు జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ తెలిపారు. జిల్లాలో 31,322 పాజిటివ్ కేసుల్ని గుర్తించగా ఇందులో 1,34,052 ప్రైమరీ కాంటాకులుగా, 2,08,703 సెకండరీ కాంటాక్టులుగా గుర్తించారు. సగటున ఒక్కో కేసుకు 4.28 ప్రైమరీ, 6.66 సెకండరీ కాంటాక్టులను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఏ ఒక్క కేసు విషయంలోనూ జాప్యం లేకుండా 24 గంటల వ్యవధిలోనే కాంట్రాక్టులను గుర్తించడంలో వైద్య సిబ్బంది, అధికారులు మంచి పనితీరు కనబరచడంతో పాటు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూం నుండి నిరంతరం పర్యవేక్షణ వల్ల కూడా ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు.

## ఘనంగా ఇంజనీర్స్ డే



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డే గా ఘనంగా నిర్వహించారు. ఇంగినీర్స్ డే సందర్భంగా మంగళవారం వంశధార సర్కిల్ కార్యాలయం వద్ద ఇంజనీర్లు అందరూ విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తోటపల్లి ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ డోలా తిరుమల రావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిరస్మరణీయుడు అన్నారు. ఆయన స్ఫూర్తి, అంకితభావంతో ఇంజనీర్లు పనిచేయాలని పిలుపునిచ్చారు. మోక్షగుండం ఆలోచనా విధానం ఇంజనీర్లకు ఎంతో ఆచరణీయమని ఆయన పేర్కొన్నారు. ఇంజినీర్లు దేశ ప్రగతిలో ముఖ్య భూమిక పోషించారని, దానిని కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు ఉన్నాయని వాటిని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్క ఇంజనీరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వంశధార ప్రాజెక్టు, తోటపల్లి ఆధునీకరణ పనులు, ఆఫ్ షోర్ ప్రాజెక్టులతో పాటు ఇతర జలవనరులను ప్రజలకు ప్రయోజనకరంగా తీర్చిదిద్ది చిరస్మరణీయంగా ఉండాలని ఆయన కోరారు. మోక్షగుండం పనితనం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన ఎంతో నీతి నిజాయితీలతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆప్కో చేనేత వస్త్రములు ఒకటి కొంటే రెండు ఉచితం

### డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ టి. జగదీశ్వరరావు

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్ద ఆప్కో రాబోయే దసరా పర్వదినం సందర్భంగా ఎంపిక చేసిన చేనేత వస్త్రాలను ఒకటి కొంటే రెండు ఉచితం అనగా 1o2 బంపర్ ఆఫర్ ను ఈనెల 2వ తేదీ నుండి పొడిగించడమైనదని ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ టి. జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు 1o1 ఆఫర్, 30 శాతం ఆఫర్లు కూడా ఉన్నాయని, ఈ సదవకాశమును చేనేత వస్త్ర ప్రియులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి చేనేత వస్త్ర కొనుగోలు చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుడానికి దోహద పడతాయని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆఫర్ ను పొడిగించారన్నారు. మనరాష్ట్రంలో ఉన్న అన్ని చేనేత ఉత్పత్తులైన ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి, పట్టు, కాటన్, ఫాన్సీ చీరలు, బెడ్ షీట్స్, లుంగీలు, టవల్స్ మొదలైన చేనేత వస్త్రాలు అన్ని అప్కో విక్రయ శాలల్లో లభించునన్నారు. జిల్లా ప్రజలందరూ విరివిగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను, నేతన్నలను ప్రోత్సహించాలని కోరారు.

## సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలి

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** సివిల్ సప్లై అమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి కామేశ్వరరావు విజయనగరం టౌన్ సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లై హమాలీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు తెలిపారు మంగళవారం స్థానిక అమర్ భవన్లో జిల్లా అధ్యక్షులు ముళ్ళు నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ డిపోలకు వెళ్లే నిత్యవసర వస్తువుల లోడింగ్ అన్ లోడింగ్ విభాగాల్లో అత్యంత కీలకంగా పనిచేస్తున్న వీరికి పని భద్రత లేకుండా పోయిందన్నారు కొరోనా అనే విపత్కర పరిస్థితుల్లో రెడ్ జోన్లలో వారి ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహించిన కార్మికులను ప్రభుత్వం గుర్తించలేదని అన్నారు జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పాయింట్లు వద్ద ఇప్పటికే నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు టి.జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విపరీత బుద్ధులు

స్వర్ణా ప్యాలెస్‌లో జరిగిన దుర్ఘటనను ప్రమాదంగా చూడకుండా ఒక సామాజిక వర్గంపై కక్ష సాధించడానికి ప్రభుత్వం వాడుకోవడం వైద్య రంగానికి చెందిన వారితో పాటు వైద్యులనూ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆస్పత్రి యజమాని రమేశ్‌బాబును అరెస్టు చేయడం కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. లీజుకు తీసుకున్న హోటల్లో అగ్ని ప్రమాదం జరిగితే డాక్టర్ రమేశ్‌ను అరెస్ట్ చేయాలనుకోవడం ఏమిటో తెలియదు. విజయవాడలో ఉన్న ఆస్పత్రులలోకెల్లా రమేశ్ ఆస్పత్రి పెద్దది. అలాంటి ఆస్పత్రిపైకుల ద్వేషంతో వ్యవహరించడం విజ్ఞత ఉన్న పాలకులు చేయవలసిన పనేనా? జగన్ రెడ్డి అనుసరిస్తున్న ఇలాంటి విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగం అభివృద్ధి చెందుతుందా? సమస్యలను సామరస్యంగా పరిష్కరించకుండా కుల ద్వేషంతో రగిలిపోవడం వల్ల అంతిమంగా ప్రజలే నష్టపోతారు. వైద్యులను కూడా కులం కోణంతో చూడడం రోత పుట్టిస్తోంది. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్న నమ్మకం కుదిరాక అవినీతి కేసులలో విచారణను వేగవంతం చేయాలన్నది బీజేపీ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు. అప్పుడు వైసీపీని బీజేపీలో విలీనం చేయాలని జగన్‌పై ఒత్తిడి తేవాలన్నది కమలదళం వ్యూహంగా చెబుతున్నారు. ఇందుకు జగన్ నిరాకరిస్తే అవినీతి కేసులలో ఆయనకు శిక్షపడి జైలుకు వెళ్లాల్సి రావచ్చు. వైసీపీని విలీనం చేసే ప్రతిపాదనను జగన్ రెడ్డి ఇదివరకే నిర్ద్వంద్వంగా తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ, వైసీపీ మధ్య సంబంధాలు ఎప్పుడైనా దెబ్బతినే అవకాశం ఉంది. భవిష్యత్తులో బీజేపీ అనుసరించబోయే వ్యూహాన్ని బట్టి జగన్ రెడ్డి పూర్తికాలం కొనసాగుతారా?లేక భార్య భారతి ఆయన స్థానంలో ముఖ్యమంత్రి అవుతారా? అన్నది తెలుస్తుంది. 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని నమ్ముతున్న జగన్ రెడ్డి భవిష్యత్తు ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉంది! "హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలు మాకు లేవు. ఆ నగరాల్లో ఉన్నట్టుగా వైద్య రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు మాకు లేవు" ..ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యక్తంచేసిన ఆవేదన ఇది! ముఖ్యమంత్రి ఆవేదనలో నిజం ఉంది. అందుకేగా, అమరావతిని అభివృద్ధి చేసుకుంటే ఈలోటు కొంతైనా తీరుతుందని పలువురు చెబుతున్నారు! మహా నగరాన్ని నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ కాలదన్నుతున్నది జగన్ రెడ్డి కాదా? మూడు రాజధానులు అనే దిక్కుమాలిన ప్రతిపాదనను తెర మీదకు తెచ్చి "మా రాజధాని ఇది" అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు చెప్పుకోలేని దుస్థితి తెచ్చింది ఎవరు? అమరావతిని కొనసాగించి ఉంటే హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులన్నీ అక్కడికి కూడా తరలివచ్చేవి కదా! కరోనా వైరస్ బాధితులకు మెరుగైన వైద్య సదుపాయాలు కొంతవరకైనా అంది ఉండేవి కదా! ఇవేవీ పట్టించుకోకుండా, ఇప్పుడు మాకు మహా నగరాలు లేవు, వైద్య రంగంలో మౌలిక సదుపాయాలూ లేవు అని ప్రధానమంత్రి దగ్గర మొర పెట్టుకుంటే ప్రయోజనం ఏమిటి? ఇలాంటి విషయాలలో ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ ప్రభుత్వంగానీ, అధికారులు గానీ ఎంతో విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులపై చర్య తీసుకునే విషయమై తెలంగాణ హైకోర్టులో రెండు రోజుల క్రితం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, కార్పొరేట్ ఆస్పత్రులను మూయించితే ఎదురయ్యే ఇబ్బందులను ధర్మాసనం ముందుకు తీసుకువచ్చారు. ఇప్పుడున్న పరిస్థితులలో ఆస్పత్రులను మూయిస్తే కరోనా బాధితులు వైద్యం అందక ఇబ్బందిపడతారు. అయినా వాటిని మూయించాల్సిందే అని న్యాయస్థానం ఆదేశిస్తే తాము అలాగే చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధర్మాసనానికి స్పష్టంచేశారు. దీంతో ప్రభుత్వ వాదనలో హేతుబద్ధత ఉందని భావించిన ధర్మాసనం కూడా ఆ వ్యవహారాన్ని అంతటితో ముగించింది. హైకోర్టు అభిప్రాయపడినట్టుగా అపోలో, బసవతారకం ఆస్పత్రులతో పాటు మరికొన్ని ఆస్పత్రులపై చర్యలు తీసుకొని ఉంటే ఏమి జరిగేదో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంతో పాటు అధికారులు కూడా పూర్తిగా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. స్వర్ణ ప్యాలెస్ హోటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో కొందరు కొవిడ్ బాధితులు మరణించారు. ఆ హోటల్‌ను రమేశ్ ఆస్పత్రి యాజమాన్యం లీజుకు తీసుకుంది. హైదరాబాద్‌లో కూడా పలు కార్పొరేట్ ఆస్పత్రులు హోటళ్లను లీజుకు తీసుకొని కరోనా బారిన పడిన వారికి చికిత్స అందిస్తున్నాయి. స్వర్ణా ప్యాలెస్‌లో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమైనది. అయితే, ఈ దుర్ఘటనను ప్రమాదంగా చూడకుండా ఒక సామాజిక వర్గంపై కక్ష సాధించడానికి ప్రభుత్వం వాడుకోవడం వైద్య రంగానికి చెందిన వారితో పాటు వైద్యులనూ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

# సెప్టెంబర్ 16 తెలుగు హాస్యనటుడు సుత్తివేలు వర్ధంతి

అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం (అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం)

1763 : హైదరాబాదు నిజాం పాలకుడు సలాబత్ జంగ్ మరణం (జ.1718).

1932 : మలేరియా పారసైట్ యొక్క జీవితచక్ర పరిశోధకుడు రోనాల్డ్ రాస్ మరణం.(జ.1857)

1945 : భారత రాజకీయ నాయకుడు పి. చిదంబరం జననం.(చిత్రంలో)

1954 : సత్యం కంప్యూటర్స్ మాజీ అధిపతి బైర్రాజు రామలింగరాజు జననం.

1969 : భారత మహిళా క్రికెట్ క్రీడాకారిణి ప్రమీలా భట్ జననం.

1975 : దక్షిణ భారత సినిమా నటి మీనా జననం.

1987 : భారత రాజకీయవేత్త దొడ్డపనేని ఇందిర మరణం (జ.1937).

2012 : తెలుగు హాస్య నటుడు, సుత్తివేలుగా సుపరిచితుడైన కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు మరణం (జ.1947).

2013 : హేతువాది, వామపక్షవాది తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి మరణం.(జ.1920

సుత్తివేలుగా ప్రఖ్యాతి గాంచిన కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు (ఆగస్టు 7, 1947 - సెప్టెంబర్ 16, 2012) తెలుగు హాస్య నటుడు. ఈయన సుమారు 200 చిత్రాలలో నటించాడు.అలాగే కొన్ని టెలివిజన్ ధారావాహికలలో కూడా నటించాడు. సుత్తివేలు అసలు పేరు కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు. ఈయన చిన్నతనంలో చాలా అల్లరి చేసేవాడు. అలాగే ఈయన చిన్నతనంలో చాలా సన్నగా ఉండేవాడు. దానితో ఈయన పక్కంటి పిన్ని జానకాంబ ఈయనను వేలు అని పిలిచేవారు. ఈయన నటించిన నాలుగు స్తంభాలాటలో ఈయన పాత్ర పేరు 'సుత్తి'. ఆ చిత్ర విజయం తరువాత అందరూ ఈయనను సుత్తివేలు అని పిలవడం ప్రారంభించారు. సుత్తివేలు తండ్రి ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. బాల్యం నుండి ఈయనకు నాటకాల పట్ల ఆసక్తి ఎక్కువ. దానితో ఏడవ తరగతి తప్పి, తండ్రితో చీవాట్లు తిన్నాడు. ఈయనకు చిన్నప్పటి నుండి నాటకాలంటే ప్రత్యేక ఆసక్తి. 1966లో పి.యు.సి చదివిన అనంతరం, హైదరాబాదుకు చేరుకున్నాడు. అక్కడ తాత్కాలిక ఉద్యోగం చేసేవాడు. 1967లో ఉద్యోగం మారి బాపట్ల చేరుకున్నాడు. ఉద్యోగం మానేసి స్నేహితులతో నాటకాలు వేసేవాడు. 1981లో విశాఖపట్నం డాక్ యార్డులో శాశ్వత ఉద్యోగం రావడంతో అక్కడికి మకాం మార్చాడు. భమిడిపాటి అంతా ఇంతే నాటకం ఆయనకు మంచి పేరు తీసుకువచ్చింది. మనిషి నూతిలో పడితే అనే నాటకంలో ఆయన పాత్రను చూసిన హాస్యబ్రహ్మ జంధ్యాల తన చిత్రం ముద్ద మందారంలో అయనకు రిసెప్షనిష్టుగా చిన్న పాత్రను ఇచ్చాడు. ఇలా 1981 లో సుత్తివేలు సినీరంగ ప్రస్థానం జరిగింది. అటు పిమ్మట జంధ్యాల, తన వరుస చిత్రాలైన మల్లె పందిరి, నాలుగు స్తంభాలాట లలో కూడా సుత్తివేలుకు అవకాశాలనిచ్చాడు. ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో సుత్తివేలు ఉద్యోగం పోగొట్టుకున్నాడు.



ఉద్యోగం పోయిన తర్వాత నటననే తన వృత్తిగా స్వీకరించాడు. ఆనంద భైరవి, రెండుజెళ్ళ సీత, శ్రీవారికి ప్రేమలేఖ, చంటబ్బాయి వంటి పలు విజయవంతమైన చిత్రాలలో హాస్యపాత్రలను పోషించాడు. త్రిశూలం చిత్రం తర్వాత అవకాశాలు సన్నగిల్లడంతో కొద్దిరోజులు కష్టాలను అనుభవించాడు. తర్వాత టి. కృష్ణ వరుసగా ఐదు చిత్రాలలో అవకాశాలిచ్చాడు. అప్పటి వరకు హాస్య పాత్రలనే పోషిస్తూ వచ్చిన సుత్తివేలుకు, ఈ చిత్రాలలో తన నటనలోని మరో పార్శ్వాన్ని ఆవిర్భవించే అవకాశం చిక్కింది. వందేమాతరం, ప్రతిఘటన, కలికాలం, ఒసేయ్ రాములమ్మ చిత్రాలలో ఆయన పోషించిన పాత్రలు మరపురానివి. వందేమాతరం చిత్రానికి గాను 1984లో ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాన్ని అందుకున్నాడు. ఈయన తన స్థిర నివాసం మద్రాసులో ఏర్పరుచుకున్నాడు. చిత్రపరిశ్రమ హైదరాబాదుకు తరలడంతో తగినన్ని అవకాశాలు దక్కించుకోలేక పోయాడు. దీనితో పలు టెలివిజన్ ధారావాహికలలో నటించాడు. ఆనందోబ్రహ్మ, మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు, భమిడిపాడి రామగోపాల్ కథలు ఈయనకు మంచిపేరు తీసుకువచ్చాయి. చివరి రోజులలో తన మకాంను హైదరాబాదుకు మార్చాడు. అనారోగ్యంతో బాధపడుతూ 2012, సెప్టెంబరు 16న మద్రాసులోని ఒక ఆసుపత్రిలో మరణించాడు.

# ఆనందో బ్రహ్మ!



ఈ చరాచర సృష్టి అంతటికీ పరమ కారణం పరమాత్మ. అతనినే మనం 'భగవంతుడు', 'పరబ్రహ్మం', 'సర్వేశ్వరుడు' అని అనేక విధాలుగా పిలుస్తున్నాం. 'ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః/ జ్ఞాన వైరాగ్య యోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా?'. సమగ్రమైన 'ఐశ్వర్యం (అధికారం), శక్తి, యశస్సు (కీర్తి), సంపద, జ్ఞానం, వైరాగ్యం.. అనే ఆరింటిని 'భగం' అంటారు. 'భగం' కలవాడు కనుక 'భగవంతుడు' అని పేరు. 'ఉత్పత్తించ వినాశంచ భూతానా మాగతిం గతిం/ వేత్తి విద్యామ విద్యాంచ సవాచ్యో భగవానితి?'. భూతాల ఉత్పత్తి, వినాశం, రాకడ, పోకడ, విద్య, అవిద్య.. అన్నీ తెలిసినవాడే 'భగవానుడు'. సృష్టి (పుట్టించడం), స్థితి (పోషించడం, శాసించడం), లయం (నాశం చేయడం), తిరోధానం (తనలోకి తీసుకోవడం), అనుగ్రహం (మరల ఉనికిని కలిగించడం) ఈ పనులను భగవంతుడే తన మాయా శక్తితో చేస్తాడు. అందువల్లే, పరమాత్మ 'పంచకృత్య పరాయణుడు'. పరబ్రహ్మానికి 'ఓం, తత్, సత్' అని మూడు పేర్లు ఉన్నాయి. 'ఓం తత్స దితి. నిర్దేశో బ్రహ్మణః త్రివిధః' అని 'భగవద్గీత' వాక్యం. 'అవతి భూతాని ఇతి ఓం'. సర్వభూతాలను రక్షించేది కనుక 'ఓం'. ఈ 'ఓంకారం' అత్యంత పవిత్రమైంది. అన్ని మంత్రాలకూ మూలం. అన్ని కర్మలకూ ముందుగా 'ఓం' చెప్తాం. దీనినే 'ప్రణవం' (మిక్కిలి స్తోత్రించదగింది) అనీ అంటాం. సర్వకారణ కారణత్వాన్ని 'తత్' అనే పదం చెబుతుంది. 'యత్తద్య తస్తతో హేతౌ'. 'యత్' (ఏది), 'తత్' (అది), 'యతః' (ఎక్కడి నుంచి), 'తతః' (అక్కడి నుంచి) ఈ నాలుగు పదాలు కారణాన్ని చెప్తాయి. పరమాత్మ నుంచే 'సర్వం' (అంతా) ఏర్పడిందని 'తత్' శబ్దం సూచిస్తున్నది. ఎల్లప్పుడూ ఉండే తత్వాన్ని (శాశ్వతత్వాన్ని) 'సత్' శబ్దం చెబుతున్నది. 'అస్తి ఇతి సత్'. ఉన్నది (ఉండేది) అనికూడా 'సత్' శబ్దానికి అర్థం. 'ఈ సృష్టికి పూర్వం నేనొక్కడినే ఉన్నాను. సత్తుకాని, అసత్తుకాని, వాటికి కారణాలు గాని ఏవీ లేవు. ఇవన్నీ నశించిపోయినా 'మిగిలి ఉండేవాడను నేనే' అని 'భాగవత' ప్రమాణం. పరమాత్మ ఒక్కడే ఎల్లప్పుడూ ఉండేవాడు. ఇది అతని శాశ్వతత్వాన్ని తెలియజేస్తున్నది. 'సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ' అని ఉపనిషత్తు వాక్యం. సత్పురుషులకు వర్తించేది సత్యం. శ్రీరామ, శ్రీకృష్ణావతారాలలో పరమాత్మ 'తన సత్యసంధత'ను నిరూపించాడు. జాయతే ఇతి జ్ఞానమ్. తెలిసేది కనుక జ్ఞానం. పరమాత్మకు సంబంధించిన జ్ఞానమే నిజమైన జ్ఞానం. ఇది వేదాల ద్వారానే తెలుస్తుంది. పరమాత్మ మాత్రమే సర్వజ్ఞుడు. 'అన్తం న విద్యతే ఇతి అనన్తం'. దేనికి అంతం (చివర) లేదో, తెలియదో అది అనంతం. పరమాత్మకు మొదలుకాని, చివరకాని లేవు. అందువల్లే పరమాత్మ అనాది, అనంతం. పరమాత్మ స్థితి ఆనందం. 'ఆనందో బ్రహ్మ' అని పెద్దల మాట. ఆనందమంటే 'సంతోషం'. కానీ, వాస్తవానికి 'ఏ వికారాలూ లేని స్థితి' ఆనందం. ప్రతి వస్తువుకు ఉత్పత్తి (పుట్టడం), సత్త (ఉండటం, బలం కలిగి ఉండటం), వృద్ధి (పెరుగుదల), పరిణామం (మార్పు చెందడం), అపక్షయం (క్షీణించడం), నాశం (నశించిపోవడం) అనే ఆరు గుణాలుంటాయి. అలాగే, సంతోషం, దుఃఖం మొదలైనవి కూడా వికారాలే. ఇవేవీ లేనివాడు కనుక, పరమాత్మ 'ఆనంద స్వరూపుడు'. పరమాత్మే సర్వవ్యాపకుడు, సర్వశాసకుడు. కర్త, కర్మ, క్రియ అంతా పరమాత్మనే. కాలాతీతుడు, గుణాతీతుడు అయిన పరమాత్మ అన్ని వస్తువులలో చైతన్యరూపమై ఉండి, అన్ని పనులూ నిర్వహిస్తాడు. అన్నీ తానే అయి కూడా దేనితో సంబంధం లేని వాని వలె ఉదాసీనంగానూ ఉంటాడు. కర్తృత్వ భావాన్ని పొందడు. ఎల్లప్పుడూ ఆనందంతోనే ఉండటం పరమాత్మ ప్రత్యేక లక్షణం. ఈ జగత్తంతా పరమాత్మ అధీనంలో ఉన్నది. కనుక, అందరికీ, అన్నిటికీ సర్వాశ్రయుడు, అనన్య శరణ్యుడు పరమాత్మనే.

# అయోధ్యకు చేరిన సుమంత్రుడు

(నిన్నటి తరువాయి)



చెప్పాడు గుహుని పక్కగా చేతులు కట్టుకుని, తల వంచుకుని నిల్చున్న వ్యక్తి. ఆ వ్యక్తి గుహుని చారుల్లో ప్రథముడు. సుమంత్రునికి అతను బాగా తెలుసు."సరే" కళ్ళు చెమర్చుకున్నాడు సుమంత్రుడు. ఆ రాత్రి గడిచింది.తెల్లారిందో లేదో, వెంటనే అయోధ్యకు బయల్దేరాడు సుమంత్రుడు. సాయంత్రానికి చేరుకున్నాడక్కడకి. రథంలో వస్తున్న సుమంత్రుని చూశారు నగరప్రజలు. ఏమయ్యా! మా రామయ్య ఏడీ? రామయ్యను ఏం చేశావు? ఎక్కడ వదలిపెట్టావు? అడిగారు."గంగను దాటి ఆవలిగట్టుకు చేరుకున్నాడు రామయ్య. అక్కణ్ణుంచి ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. నన్ను అయోధ్యకు వెళ్ళిపొమ్మన్నాడు, రామాజ్ఞకు కట్టుబడివచ్చేశాను." అన్నాడు సుమంత్రుడు. అయితే రామయ్య ఎక్కడికి చేరిందీ నీకు ఖచ్చితంగా తెలీదు, అంతేనా? అడిగారు ప్రజలు. అంతే అన్నాడు సుమంత్రుడు. కన్నీరు పెట్టుకున్నాడు. రాజప్రాసాదానికి చేరుకున్నాడు. పహారాలో ఉన్న ఏడు ద్వారాలనూ దాటాడు. ఎనిమిదవ కక్ష్యలోకి ప్రవేశించాడు. అక్కడ బాధగా ఉన్న దశరథుణ్ణీ, అతని భార్యలనూ చూశాడు. దశరథునికి నమస్కరించి, అతని ముందు నిలిచాడు. రాముడు ఎక్కడ ఉన్నాడు? ఏమైపోయాడు అని అడగలేదు దశరథుడు. ఒంటరిగా వచ్చిన సుమంత్రుని చూసి కన్నీరు పెట్టుకుని గుండెలు బాదుకున్నాడు. వారించాడు సుమంత్రుడు. అయినా కష్టమైంది. మూగగా రోదిస్తూ మూర్ఛపోయాడు దశరథుడు. స్వామి స్వామి అని పత్నులంతా చుట్టుముట్టారతన్ని. కాస్సే పటికి తేరుకున్నాడు దశరథుడు. సుమిత్ర సాయం తో కౌసల్యాదేవి అతన్ని లేపి కూర్చోబెట్టింది. దుమ్ము కొట్టుకుపోయి ఉన్నాడు దశరథుడు. శిరస్సు నిలవడం లేదు. వేలాడిపోతోంది. కన్నీరు కారుస్తూ ప్రయాస మీద తలెత్తి, సుమంత్రుణ్ణి చూశాడు దశరథుడు. "సీతారామలక్ష్మణులు అడవుల్లో ప్రవేశించడాన్ని నువ్వు చూశావు, ధన్యుడివి సుమంత్రా! నువ్వు ధన్యుడివి." అన్నాడు. అంతలోనే మళ్ళీ ఇలా అన్నాడు."ఎటు వెళ్ళా రయ్యా? వాళ్ళెక్కడికి వెళ్ళారు? అడుగడుగునా పాములు బుసలుకొట్టే అడవిలో కాలినడకన ప్రయాణించడం అంటే.. .ప్రమాదాలను కొని తెచ్చు కోవడమే! నా రాముడు ఏ చెట్టుకింద పడుకు న్నాడు? సీతాలక్ష్మణులసహా ఏం తిన్నాడు? ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? నాకేమయినా చెప్పమన్నాడా? ఆ మాటలు చెప్పు, ఆనందిస్తాను." అన్నాడు దశర థుడు. తాను మహారాజుని అన్న సంగతి మరచి పోయాడు. ప్రార్థిస్తున్నట్టుగా సుమం త్రునికి చేతులు జోడించి నమస్కరించాడతను. "మహా రాజా" వారించాడు సుమంత్రుడు. దశరథుని చేతుల్ని వేరు చేశాడు. అతని పాదాలు పట్టుకుని నమస్కరించాడు. "ఇలా మీ పాదాలను పట్టుకుని తన మారుగా నన్ను నమస్కరించమన్నాడు రాముడు." అన్నాడు సుమంత్రుడు. లేచి నిల్చున్నాడు. రాజపత్నులందరికీ చేతులు జోడించి నమస్కరించాడు."మీ అందరికీ నమస్కారాలని చెప్పమన్నాడు." అన్నాడు. కౌసల్యను చూశాడు. ఆమెతో అన్నాడిలా."తల్లీ! మిమ్మల్ని ఎప్పటిలాగానే ఉండ మన్నాడు రాముడు. మీ పనులన్నీ చక్కదిద్దుకోమన్నాడు. అగ్నిహోత్రాల్ని రక్షిస్తూ, రాజుని దేవునిలా సేవించమన్నాడు. కైకమ్మగారిని మాటలతో కష్టపెట్టొద్దన్నాడు. భరతుడు రాజు అనే మాటను మరచి ప్రవర్తించవద్దన్నాడు." కౌసల్య దుఃఖిస్తూ కుప్పకూలిపోయింది."భరతుడు రాజ్యానికి రాగానే అతని క్షేమం అడిగానని చెప్పమన్నాడు. రాజ్యాన్ని స్వీకరించి, మహారాజుని ఆప్యాయంగా చూడమన్నాడు. అలాగే కౌసల్యాదేవిని, తల్లి కైకలా చూసుకోమని ప్రార్థించి నట్టుగా చెప్పమన్నాడు." అన్నాడు సుమంత్రుడు. భోరుమన్నారంతా."లక్ష్మణుడు ఏమన్నాడు? దాచకు సుమంత్రా! నాకు అన్నీ అంతా చెప్పు." అడిగాడు దశరథుడు."కైక కోరిక మేరకే కదా, రామునికి ఇంతటి అన్యాయం చేశాడు రాజు. అందుకని, ముద్దుల భార్యకు వరాలిచ్చేటప్పుడు ముందు వెనుకలు చూసుకోమని మీకు చెప్పమన్నాడు. చూసుకోకపోతే ఇదిగో ఇలాగే అందరూ దుఃఖించాల్సి వస్తుందని చెప్పమన్నాడు. ఈసారి మళ్ళీ వరాలు ఇచ్చి నప్పుడు వివరాలు అడిగి తెలుసుకోమన్నాడు. లేకపోతే జరిగిన అనర్థాలకు మహారాజే కారకుడు అవుతాడని, అందుకు అతనే శిక్షార్హుడని పదే పదే చెప్పమన్నాడు."

(మిగతా రేపటి సంచికలో)

# ఇమ్యూనిటీ పెరగాలంటే....



కరోనా రక్షణ చర్యల్లో ప్రధానమైనది సమర్థమైన వ్యాధినిరోధకశక్తి. దీని పెంపు కోసం అనుసరించవలసిన నియమాలను ఆయుర్వేదం సూచిస్తోంది. మర్దన: స్వీయ మర్దనతో నాడులు విశ్రాంతి పొందుతాయి. ఒత్తిడి తొలగి వ్యాధినిరోధకశక్తి మెరుగవుతుంది. ఇందుకోసం నువ్వుల నూనెతో ప్రతి రోజూ అభ్యంగనం చేసుకోవాలి. దీంతో పాటు ఆయిల్ పుల్లింగ్ (నూనెతో నోరు పుక్కిలించడం), నశ్య క్రియ కూడా సాధన చేస్తే ఫలితం ఉంటుంది. ఇన్వర్టెడ్ యోగా: శరీరం ముడుచుకునే యోగాసనాలతో కూడిన ఇన్వర్టెడ్ యోగాతో లింఫ్ స్రావాల ప్రసారం పెరిగి, వ్యర్థాలు, సూక్ష్మక్రిములు బయటకు వెళ్లిపోతాయి. ఇందుకోసం ఛాతీ కంటే తల దిగువకు ఉండే ఉత్తనాసనం, సర్వాంగాసనం వేయాలి. ఈ ఆసనాలతో లింఫ్ స్రావాలు తేలికగా శరీరంలోకి సూక్ష్మక్రిములు చొరబడే వీలున్న శ్వాసతో సంబంధం కలిగిన అవయవాల్లోకి చేరి వాటిని వెలుపలికి తీసుకువస్తాయి. తీయని, చల్లని, వేయించిన పదార్థాలు వద్దు: చల్లని పానీయాలు, పదార్థాలు తీసుకుంటే జీర్ణాగ్ని నెమ్మదిస్తుంది. వేయించిన పదార్థాల అజీర్తిని కలిగిస్తాయి. తీపి కఫాన్ని పెంచుతుంది. కాబట్టి వీటిని తగ్గించాలి. తులసి: తులసికి కఫాన్ని కరిగించి, బయటకు తెప్పించే గుణం ఉంటుంది. జలుబును కలిగించే ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా చేస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కాచిన తులసి నీళ్లు తీసుకోవాలి.

# డీహైడ్రేషన్‌కు లోనవకుండా...





ఎక్కువ సమయం వ్యాయామం చేయడం, ఎండ ఎక్కువగా ఉండడం వల్ల శరీరం ఎక్కువగా నీటిని కోల్పోతుంది. డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. దీంతో జీవక్రియల లయ దెబ్బతింటుంది. అంతేకాదు కాలేయం, మూత్రపిండాల పనితీరు మీద ప్రభావం చూపడంతో పాటు జీర్ణసంబంధమైన సమస్యలు ఏర్పడతాయి. డీహైడ్రేషన్ సమస్య నుంచి బయటపడేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు చెబుతున్నారు పోషకాహార నిపుణురాలు, మై22బీఎంఐ స్థాపకురాలు ప్రీతీ త్యాగీ. క్రీడాకారులు, జిమ్‌కు వెళ్లేవారు, ఎదుగుతున్న పిల్లలు వాటర్‌బాటిల్‌లో కొద్దిగా ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లను వెంట తీసుకెళ్లాలి. ఈ నీళ్లు తాగితే ఎలక్ట్రోలైట్స్ అందుతాయి. కాచి చల్లార్చిన నీళ్లను తాగడం అన్ని విధాలా మంచిది. నీళ్లతో పాటు తాజా పండ్లు, కూరగాయలు, ఎక్కువ శాతం నీరు ఉండే కీరదోస, చిలగడదుంప, స్ట్రాబెర్రీలు, పుచ్చకాయ, మస్క్‌మెలన్, నిమ్మజాతి పండ్లను తినాలి. గ్లాసు వేడినీళ్లలో జీలకర్ర , మెంతి, సోంపు, తులసి పొడి కలిపి తాగితే ఒంట్లో నీరు తగ్గకుండా చూసుకోవచ్చు. కాఫీ, టీ, స్వీట్లు, వేపుడు ఆహారపదార్థాలు తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తూనే జీవక్రియలు మెరుగ్గా జరిగేందుకు రోజూ వ్యాయామాలు చేస్తూ ఉండాలి.

ఓటమియనునదియ
ఒనరగగొప్పది!
అర్థమగును జగతి యంతచూడ!
గెలుపు
కాదెయదియ!మలుపు
తిరుగుభావి
తెలిసి మెలగుమయ్య!
తెలుగు వాడ!



– మల్లాది సోమేశ్వర శర్మ,
9603995769












## కాలేజీ టైంలోనే డేటింగ్ చేసేసా'

ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్.. హైదరాబాద్ లో పుట్టిన ఈ గ్లామర్ డాల్ ముంబైలో పెరిగి అక్కడే సెటిల్ అయింది. 'మున్నా మైకెల్' సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసిన నిధి.. నాగచైతన్య సరసన 'సవ్యసాచి' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే టైగర్ ష్రాఫ్ తో కాలు కదపడంతో అందరి దృష్టి తన వైపు మళ్లింది. మున్నా మైకెల్ సినిమాలో నిధిని చూసిన ప్రతి ఒక్కరు ఫిదా అయిపోయారు అనుకుంది కానీ అవకాశాలు మాత్రం నిధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. ఇండస్ట్రీలోకి ఎన్నో కష్టాలు పడి వచ్చిన నిధి.. బాలీవుడ్ లో అదృష్టం కలిసి రాలేదని.. 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఆశలు పెట్టుకున్న సినిమా ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో అమ్మడు కాస్త టైం తీసుకొని అఖిల్ హీరోగా నటించిన 'మిస్టర్ మజ్ను'లో కన్పించింది. అది కూడా బాక్స్ ఆఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇక గతేడాది పూరీ జగన్నాథ్ దర్శకత్వలో తెరకెక్కిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో కెరీర్ లో మొదటి హిట్ ను అందుకుంది. ఇక అవకాశాల కోసం గ్లామర్ షో చేయాలని గ్రహించి గ్లామర్ డోస్ పెంచేసింది. ఇక ప్రస్తుతం ఇంటిపట్టునే ఉంటున్న ఈ భామ ఇటీవల తన లవ్.. బ్రేకప్.. క్రష్.. గురించిన వివరాలు బయట పెట్టేసింది. చిన్నప్పుడు స్కూల్లో నాలుగవ తరగతి చదివేటప్పుడే.. ఫస్ట్ టైం ఒక అబ్బాయితో ప్రేమలో పడిందట నిధి. అలా చిన్న వయసులోనే లవ్ అనుభూతి పొందిన అమ్మడు తన ప్రేమను ఎక్కువ కాలం నిలుపుకోలేకపోయిందట. ఆ తర్వాత కాలేజ్ టైంలో మరొక అబ్బాయితో డేటింగ్ కి వెళ్లినట్లు ఒప్పేసుకుంది భామ. ఆ అబ్బాయి లవ్ ప్రపోజల్ ఎప్పటికి మరచిపోలేనని చెబుతోంది. మరి తర్వాత ఏమైందో.. పెద్దగా బయటపెట్టని ఈ అమ్మడు ప్రస్తుతం ప్రేమలో ఉందా లేదా అనేది క్లారిటి ఇవ్వలేదు. ఇక తన సెలబ్రిటీ క్రష్ గురించి చెప్తూ.. బాలీవుడ్ బాద్షా షారుఖ్ అంటే పిచ్చి అంటూ చెప్పుకొచ్చింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం అమ్మడు గల్లా అశోక్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది.



## వామ్మో ఇదేం హాట్ నాయనో

జనంలో ఎప్పుడూ చర్చల్లో వుండే విధంగా ప్లాన్ చేసుకోవడం వర్మకి తెలిసినంతగా మరెవరకీ తెలిసి ఉండదు. ఈ మధ్యకాలంలో లాక్ డౌన్, కరోనా వార్తలు హెడ్ లైన్స్‌లో ఎలా నిలుస్తున్నాయో.. ఇంత సీరియస్ ఇష్యూల్లోనూ తనపై ఫోకస్ ఉండేలా ప్లాన్ చేసుకుని వరుస చిత్రాలను విడుదల చేశాడు వర్మ. ఈ లాక్ డౌన్‌లో పోర్న్ స్టార్ మియా మాల్కోవాతో క్లైమాక్స్ తీసిన వర్మ.. స్వీటీ అనే నగ్న సుందరితో 'నగ్నం' చిత్రాన్ని తీశాడు. ఈ సినిమా కోసం వెస్ట్ గోదావరి నుంచి స్వీటీ అనే హాట్ పాపను తెరపైకి తీసుకువచ్చాడు వర్మ. ఆమె హాట్ నెస్‌తో కుర్రకారుకి పిచ్చెక్కేలా చేశాడు. శ్రీ రాపాక అనే క్యాస్ట్యూమ్ డిజైనర్‌ను స్వీటీ అని పేరు మార్చి ఆమెతో నగ్నం అనే నగ్న చిత్రాన్ని రూపొందించి సోషల్ మీడియా వదిలిపెట్టాడు. ఇప్పుడు వర్మ వదిలిన ఈ నగ్న సుందరి శ్రీ రాపాక యూట్యూబ్‌లో పెద్ద సంచలనంగా మారింది. 8 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా రాని గుర్తింపు.. నగ్నం అనే లఘు చిత్రంతో అందించి శ్రీ రాపాకను ఓవర్ నైట్ స్టార్‌ని చేశారు వర్మ.

## ప్రభాస్, విజయ్ దేవరకొండ నా డ్రీమ్ హీరోలు



ప్రభాస్, విజయ్ దేవరకొండతో కలిసి నటించడం తన కల అని అన్నారు హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. త్వరలోనే వాళ్లిద్దరితో కలిసి నటించే అవకాశం వస్తుందని ఆమె. 100 సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్.. తొలి సినిమాతోనే ఆకట్టుకున్నారు. ఈ ఒక్క సినిమాతోనే ఆమె పాపులర్ అయిపోయారు. పాయల్ రాజ్‌పుత్ అంటే అందం మాత్రమే కాదు ప్రతిభావంతురాలైన నటి కూడా. ఏ క్యారెక్టర్‌లోనైనా ఆమె ఒదిగిపోగలదు. ఆమె ఇప్పటి వరకు చేసిన పాత్రలన్నీ అలాంటివే. కాకపోతే, 100 సినిమా తరవాత ఆమె చేసిన చిత్రాలు అంతలా ఆడలేదు. మరోవైపు, 'వెంకీమామ'లో పాయల్ చేసిన పాత్రకు విమర్శలు వచ్చాయి. అయితే, 'డిస్కోరాజా'లో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం పాయల్ లేడీ ఓరియెంటెడ్ సినిమా '5 తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా పాయల్ రాజ్‌పుత్ 'తెలుగు బులెటిన్' వెబ్‌సైట్‌తో మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాస్ మహారాజా రవితేజ అంటే తనకు చాలా ఇష్టమని చెప్పారు. టాలీవుడ్‌లో రవితేజ, ప్రభాస్ తన ఫేవరేట్ హీరోలని వెల్లడించారు. ఫేవరేట్ హీరోయిన్ తమన్నా అని పేర్కొన్నారు. అయితే, తనకు ప్రభాస్, విజయ్ దేవరకొండ చిత్రాల్లో నటించాలన్నది కల అని చెప్పారు పాయల్. త్వరలోనే తన కల నెరవేరుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. అలాగే, దర్శకులు సందీప్ రెడ్డి వంగ, తేజతో పనిచేయాలని ఉందని పాయల్ అన్నారు. 100 డైరెక్టర్ అజయ్ భూపతితో కూడా మరోసారి పనిచేయాలని ఉందన్నారు. ఇక తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. మోడలింగ్ నేర్చుకున్న తరవాత ఢిల్లీ నుంచి ముంబై వెళ్లానని, అక్కడికి వెళ్లిన కొన్ని రోజులకే హిందీ సీరియల్‌లో అవకాశం వచ్చిందని పాయల్ చెప్పారు.

## ప్రేమకథలో ఆలియా

బాలీవుడ్ టు టాలీవుడ్ ఇటీవల ఆలియా పేరు మార్మోగుతోంది. వరుస బ్లాక్ బస్టర్లతో ఉత్తరాది పరిశ్రమలో సంచలనాలు నమోదు చేసిన ఆలియా తెలుగు సినీపరిశ్రమలో అడుగు పెడుతుండడం అందునా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన ఆర్.ఆర్.ఆర్ లాంటి భారీ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తుండడంతో ఒకటే ఆసక్తి నెలకొంది. అన్నీ కుదిరితే ఆర్.ఆర్.ఆర్ ఈపాటికే రిలీజ్ కావాల్సినది. కానీ మహమ్మారీ క్రైసిస్ అన్నిరకాలుగా ఇబ్బందిపెడుతోంది. ఇదొక్కటే కాదు ఆలియా నటించిన బ్రహ్మాస్త్ర సహా పలు చిత్రాలు రిలీజ్ కి రావాల్సినవి పెండింగులో ఉండిపోయాయి. ఒక రకంగా ఆలియా నటించిన పాన్ ఇండియా సినిమాలన్నీ అనవసర గందరగోళంలో పడిపోయాయనే చెప్పాలి.అయితే ఏ పరిస్థితి ఎలా ఉన్నా.. ఆలియాకు ఆఫర్లు మాత్రం ఆగడం లేదు. ఓవైపు సినిమాలు రిలీజ్ కాకపోయినా మరోవైపు సినిమాలకు సంతకాలు చేస్తూ క్షణం తీరిక లేనంత బిజీ అయిపోతోంది. ఈ ప్రతిభావంతులైన నటి కాల్షీట్ల కోసం అనేక మంది సీనియర్లతో పాటు అగ్ర దర్శకులు వేచి ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఆస్కార్ విజేత కం సౌండ్ డిజైనర్ రసూల్ పోకుట్టి తొలిసారి నిర్మాతగా మారి రూపొందించనున్న తాజా చిత్రంలో అలియా భట్ నటించనుంది. రసూల్ కొంతకాలంగా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నాడు. ఇండో-చైనా సరిహద్దులో జరిగిన కొన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కనున్న రొమాంటిక్ ఎంటర్ టైనర్ ఇది. 1967 లో నాథుల (ఇండో చైనా) సరిహద్దు నేపథ్యంలో కథాంశమిది. ఇటీవలి కొన్ని ఎపిసోడ్లకు సంబంధించిన సమాచారం సేకరించారు. సరిహద్దుల్లో బాబా హర్భజన్ సింగ్ అనే భారతీయ సైనికుడి వీర ప్రేమ కథ ఇదని తెలుస్తోంది. త్వరలోనే అధికారికంగా ఈ మూవీలో పని చేసే నటీనటులు సహా సాంకేతిక నిపుణుల వివరాల్ని ప్రకటిస్తామని రసూల్ పూకుట్టి తెలిపారు. ఆలియా ఈ మూవీలో నటించేందుకు ఎంతో ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తోందట.





## పింక్‌లో శ్రుతి సెల్ఫ్ షాట్

కెరీర్ పీక్స్ లో ఉండగానే పర్సనల్ లైఫ్ కి ప్రాధాన్యత అంటూ అన్నిటినీ వదిలిపెట్టి వెళ్లిపోయింది. విదేశీ బోయ్ ఫ్రెండ్ మైఖేల్ కోర్సలేతో మత్తులో మునిగిపోయి సర్వాన్ని త్యజించింది. అయితే పర్సనల్ లైఫ్ ఏదైనా తనకు సాంత్వన కలిగించిందా? అంటే అదేమీ కనిపించలేదు. ప్రేమ వైఫల్యం చాలా ఇబ్బందులకు గురి చేసింది. ఆ తర్వాత డిప్రెషన్ నుంచి కోలుకునేందుకే ఏళ్లకు ఏళ్లు పట్టింది. ఇన్నాళ్టికి ఎలాగోలా కుదుటపడుతోంది శ్రుతి లైఫ్. ఇప్పుడిప్పుడే జనసందోహంలోకి వస్తోంది. మాస్ మహారాజ్ రవితేజ సరసన క్రాక్ అనే చిత్రంలో నటిస్తోంది. బలుపు ఫేం గోపిచంద్ మలినేని ఈ చిత్రంలో రవితేజకు శ్రుతి అయితేనే సరిజోడు అని భావించి ఎంపిక చేసుకున్నారు. అంతా సవ్యంగా సాగితే ఈపాటికే సినిమా రిలీజ్ కావాల్సినది. కానీ వైరస్ మహమ్మారీ ప్రణాళికల్ని దెబ్బ కొట్టింది. అయితే ఈ గ్యాప్ లో శ్రుతి పూర్తిగా వరుస ఫోటోషూట్లతో వేడి పెంచుతోంది. తాజాగా తనకు తానే తీసుకున్న సెల్ఫ్ షాట్ ఫోటోల్ని రిలీజ్ చేస్తూ అంతకంతకు హీట్ పెంచేస్తోంది. ఇవన్నీ ప్రఖ్యాత జేఎఫ్.డబ్ల్యూ కవర్ పేజీ కోసం సెలెక్ట్ చేసినవి. నిన్ననే శ్రుతి లేటెస్ట్ షూట్ కి సంబంధించిన జేఎఫ్. డబ్ల్యూ కవర్ పేజీ ఫోటో రిలీజైంది. ఆ తర్వాత సెకండ్ ఫోటో ఇదిగో ఇలా అంతర్జాలంలో వైరల్ గా దూసుకుపోతోంది. పింక్ మఖమల్ డిజైనర్ వేర్ లో శ్రుతి స్టన్నింగ్ అప్పియరెన్స్ మతి చెడగొడుతోంది. ముఖ్యంగా ఆ ఇన్నర్ డిజైన్ లోహకాంతులు తళతళలాడిపోతూ శ్రుతి అందాల్ని పదింతలు పెంచాయి. పింక్ కి కాంబినేషన్ గా ఆ గోల్డ్ షైన్ కలర్ హైహీల్స్ పర్ఫెక్ట్ గా యాప్ట్ అయ్యాయి. మేకప్.. డిజైన్ సహా ప్రతిదీ శ్రుతి స్వయంగా సెల్ఫ్ గా రెడీ అయినవే కావడం ఇక్కడ మరో ప్రత్యేకత.

## నిర్మాతగా చిరంజీవి కూతురు సుస్మిత



చిరంజీవి ఇంటి నుంచి మరొకరు నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతున్నారు. తాజాగా చిరు పెద్ద కూతురు సుస్మిత నిర్మాతగా మారబోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ గురించి అందరికీ తెలిసిందే. చిరు కుమారుడు రామ్ చరణ్ స్టార్ హీరోగా సినిమాల్లో రాణిస్తున్న విషయం తెలిసిందే. అటు పెద్ద కూతురు సుస్మిత కూడా చిరు సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తుంది. చిరంజీవి నటించిన ఇంద్ర, సైరా వంటి సినిమాలకు ఆమె కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసింది. తన టాలెంట్‌తో మంచి పేరు కూడా సంపాదించుకున్నారు. ఇక చిన్న కూతురు శ్రీజ పెద్దగా ఈ విషయాల్ని పట్టించుకోదు. అయితే సుస్మిత మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన కెరీర్ ని మరో మలుపు తిప్పేందుకు ఇప్పుడామె నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతూ నిర్మాతగా కూడా మారుతున్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్ టైన్మెంట్' పేరిట ఓ చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పాలని సుస్మిత సిద్ధమయ్యారు. అయితే దానికన్నా ముందుగా వెబ్ సిరీస్ నిర్మాణానికి ఆమె శ్రీకారం చుట్టారు. నిన్ననే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఓటీటీ వేదికలు బాగా ప్రాచుర్యంలోకి రావడంతో వాటి కోసం ఆమె పలు వెబ్ సిరీస్ లను నిర్మించడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇక ముందు ముందు తమ ఫ్యామిలీ హీరోలతో ఆమె సినిమాలు కూడా నిర్మించే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఇంకేముంది అంతా అనుకున్నట్లు జరిగితే ఇక సుస్మిత కూడా సినీ నిర్మాతగా మారనున్నారు. ఇప్పటికే చిరు తనయుడు రామ్ చరణ్ నిర్మాణ రంగంలోకి వచ్చిన విషయం తెలిసిందే. తండ్రి చిరంజీవి రీ ఎంట్రీ మూవీ 'ఖైదీ నెంబర్ 150'తో నిర్మాతగా మారాడు రామ్ చరణ్. ఆ తర్వాత 'సైరా నరసింహారెడ్డి' సినిమాను నిర్మించాడు.

## ప్రభాస్ -హృతిక్ మల్టీస్టారర్ యువీలోనేనా?



డార్లింగ్ ప్రభాస్ సినిమా అంటే అది కచ్చితంగా యువి క్రియేషన్స్ లోనే ఉంటుందనేది తెలిసిన వ్యవహారమే. స్నేహితులతో కలిసి ప్రభాస్ ఈ బ్యానర్ ని విజయవంతంగా రన్ చేస్తున్నారు. ముఖ్యంగా బాహుబలి 1.. బాహుబలి 2 సంచలన విజయాలు సాధించిన తర్వాత ప్రభాస్ యు.వి.క్రియేషన్స్ లోనే వరుసగా రెండు చిత్రాల్లో నటించారు. బాహుబలి ఫ్రాంఛైజీని ఆర్కా మీడియా సంస్థ సక్సెస్ చేసింది. ఆ తర్వాత సాహో చిత్రం యువి క్రియేషన్స్ బ్యానర్ లో అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కి రిలీజైంది. ఆ సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా సాహో సెట్స్ లో ఉండగానే ప్రభాస్ 20 చిత్రాన్ని కూడా ఇదే బ్యానర్ లో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమాకి రాధేశ్యామ్ అనే టైటిల్ వినిపిస్తోంది. చిత్రీకరణ ముగింపులోనే ఉండగా మహమ్మారీ లాక్ డౌన్ వల్ల వాయిదా పడింది. ప్రభాస్ 21 ఇప్పటికే నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ లో లాక్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రభాస్ నటించే 22వ సినిమా గురించి ఇప్పటికే ఆసక్తికర చర్చ సాగుతోంది. 2021 ఎండింగ్ లేదా 2022లో ప్రారంభమయ్యే ఈ మూవీకి బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహిస్తారని ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా కేటగిరీలో తెరకెక్కిస్తారని ప్రచారమవుతోంది. అయితే ఈ మూవీని ఏ బ్యానర్ లో నిర్మిస్తారు? అన్నదానికి మాత్రం ఇంతవరకూ సరైన క్లారిటీ లేదు. ఒకవేళ ప్రభాస్ 22 లో హృతిక్ నటిస్తే అది భారీ మల్టీస్టారర్ గా అవతరిస్తుంది. అప్పుడు కచ్చితంగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టై అప్ తప్పనిసరి అని భావిస్తున్నారు. అలాంటప్పుడు ప్రభాస్ కి చెందిన యువి క్రియేషన్స్ సంస్థ బాలీవుడ్ నిర్మాణ సంస్థతో భాగస్వామ్యంలో ఈ మూవీని నిర్మించే వీలుందని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ మూవీ బడ్జెట్ రేంజ్ కూడా ఊహించనంతగా ఉంటుందని ఫ్యాన్స్ లో ఎగ్జయిట్ మెంట్ నెలకొంది. అయితే దీనిని అధికారికంగా కన్ఫామ్ చేస్తూ డార్లింగ్ ఏదైనా సమాచారం ఇస్తారేమో చూడాలి.

## చిచ్చురేపుతున్న అందాల రాక్షసి!!




ఏ మంత్రమో అల్లేసిందిలా.. అంటూ 2012లో 'అందాలరాక్షసి' సినిమాతో తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టింది లావణ్య త్రిపాఠి. తన ఫస్ట్ సినిమాతోనే క్యూట్ క్యూట్ అభినయంతో ఆకట్టుకున్న లావణ్య.. టాలీవుడ్ కి మరో తెలుగు అమ్మాయి లాంటి అందం దొరికిందనే ఫీల్ కలిగించింది. ఇక ఈ డెహ్రాడూన్ అమ్మడికి తిరుగుండదులే అని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే భలే భలే మగాడివోయ్.. శ్రీరస్తు శుభమస్తు.. సోగ్గాడే చిన్ని నాయనా.. హిట్లతో అభినయానికి అవకాశమున్న పాత్రలనే ఎంచుకుంటూ వచ్చింది ఈ ముద్దుగుమ్మ. కొంతకాలం తరువాత వరుస పరాజయాలతో లావణ్య వెనుక పడిపోయింది. ఇక ఈ హీరోయిన్ కెరీర్ ముగిసినట్టే అని అందరూ అనుకునేలా చేసింది. కానీ చాలా గ్యాప్ తీసుకొని మళ్లీ ఇటీవలే 'అర్జున్ సురవరం' సక్సెస్ తో ఈ 'అందాల రాక్షసి' సక్సెస్ ట్రాక్ ఎక్కింది. అయితే అందాల రాక్షసి నుండి అర్జున్ సురవరం వరకు లావణ్య ఒక్కసారి కూడా టాప్ లిస్టులో అడుగు పెట్టలేకపోయింది. ఇక తాజాగా అమ్మడు ఇన్స్టాగ్రామ్ వేదికగా అందాల విందు ఆరంభించింది. ప్రస్తుతం లావణ్య యువ హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోంది. ఇటీవలే తమిళంలో 'వాల్మీకి' ఫేమ్ అధర్వ మురళీ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. అలాగే సందీప్ కిషన్ 'ఏ1 ఎక్స్ ప్రెస్' చిత్రంలో లావణ్య హాకీ ప్లేయర్గా నటిస్తోంది. వీటితో పాటు కార్తికేయ హీరోగా నటిస్తున్న 'చావు కబురు చల్లగా'లో హీరోయిన్గా ఫైనలయింది. ఇటీవల అవసరమైతే బికినీ అందాలను ఆరబోయడానికి తాను సిద్ధమంటూ సంచలనం రేపింది. తాజాగా లావణ్య ఇన్స్టాగ్రామ్ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైట్ సారీ కట్టుకొని చాలా పద్ధతిగా ఎలాంటి గ్లామర్ షో చేయకుండా సింపుల్ పోజిచ్చింది. కానీ చీర కడితే ఎలాంటి బ్యూటీ అయినా వారి అందం రెట్టింపు అవుతుందని మళ్లీ నిరూపించిందని నెటిజన్లు తెగ పొగిడేస్తున్నారు. మరి అమ్మడు త్వరలో ఏదైనా భారీ హిట్ కొడుతుందేమో చూడాలి!

## బాలకృష్ణకు జోడీగా అమలాపాల్!



బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా అమలాపాల్‌ను ఎంపిక చేశారని టాక్. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లకు చోటు ఉండగా.. అందులో ఒక హీరోయిన్‌గా అమలాపాల్‌ను ఓకే. నటసింహ నందమూరి బాలకృష్ణ హీరోగా మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా వస్తోన్న సంగతి తెలిసిందే. ఇది బాలకృష్ణ 106వ చిత్రం. ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. 'మోనార్క్', 'సూపర్ మ్యాన్' టైటిల్స్‌ను పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ టాక్. ఈ చిత్రాన్ని ద్వారకా క్రియేషన్స్ బ్యానర్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో బాలకృష్ణ తప్ప ఇతర పాత్రధారులు ఎవరనే విషయంపై అధికారిక ప్రకటనలేదు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని చిత్ర వర్గాల సమాచారం. ఈ ఇద్దరిలో ఒక కొత్త హీరోయిన్‌కు చోటుందట. ఇక మరో హీరోయిన్‌గా ఎవరిని ఎంపిక చేశారనే విషయంలో ఇప్పటికే చాలా రూమర్లు వచ్చాయి. హీరోయిన్ అంజలి పేరును కూడా బోయపాటి శ్రీను పరిశీలించారని సమాచారం. అయితే ప్రముఖ నటి అమలాపాల్ ఈ సినిమాలో బాలయ్య సరసన నటించనున్నారని తాజా వినిపిస్తోన్న వార్త. ఇది సినిమాకు చాలా కీలకమైన పాత్ర కావడంతో అమలాపాల్‌ను బోయపాటి సంప్రదించారట. ఆమెకు కథ నచ్చడంతో వెంటనే పచ్చజెండా ఊపేసారని అంటున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వస్తుందట.

# తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప




## లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి

### రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు ఎస్ బి. అంజాద్ బాషా



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 15 :** లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీటిని వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్బాష పేర్కొన్నారు. మంగళవారం లోహియానగర్, బుడగజంగంకాలనీ, చెంచు కాలనీ, ఏఎస్ ఆర్ నగర్, రామరాజుపల్లె, ఎస్బిఐ కాలనీ, లను ఉపముఖ్యమంత్రి వర్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలవల్ల కడప నగరంలోని కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయ న్నారు. దీంతో నేడు లోహియానగర్, బుడగజంగం కాలనీ, ఏ ఎస్ ఆర్ నగర్, చెంచు కాలనీ, రామరాజుపల్లె, ఎస్బిఐ కాల నీలనులను సందర్శించడం జరిగిందన్నారు. ఇవి లోతట్టు ప్రాంతాలని గతంలో ఇది ఒక చెరువు అన్నారు. గతంలో ఇక్కడ ఇళ్లపట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడం వల్ల ఈ ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. ఇది పేదలు నివసించే ప్రాంతమని ఎస్సీ, ఎస్టీ, బిసి, చెంచులు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉంటారన్నారు. ఇక్కడ పెద్ద పెద్ద మెయిన్ డ్రైన్స్ అన్ని నిండిపోవడం వల్ల ఇళ్లల్లోకి నీరు రావడం జరిగిందన్నారు. వెంటనే మెయిన్ డ్రైన్ లన్నీ మరమ్మతులు చేపట్టి కాలువలద్వారా నీరంతా బయటికి వెళ్ళే విధంగా చూడాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లవన్న, ఎస్ ఈ సత్యనారాయణ, ఎం హెచ్ ఓ శ్రీనివాసులురెడ్డి, ఈ ఈ ధనలక్ష్మి, భాస్కర్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ రవీంద్ర, శానిటరీ సెక్రటరీలు, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, కార్పొరేటర్ అభ్యర్థి బాలస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆదరణ కోల్పోయిన అలనాటి ఆలయం



**ఉదయగిరి, సెప్టెంబర్ 15 వార్తావళి:** సుమారు వెయ్యేళ్ళ సుదీర్ఘ చరిత్ర సొంతం చేసుకున్న ఉదయగిరి దుర్గం పై మనకు దర్శనం ఇచ్చే ఒకే ఒక ఆలయం వల్లభ రాయుని ఆలయం. దుర్గం పల్లెకు చేరగానే మనకు కనిపించే నిర్మాణం ధూప దీప నైవేద్యాలతో నిత్యం విరాజిల్లే ఆ దేవాలయం కాల క్రమేణా వైభవం కోల్పోయి శిథిలావస్త కు చేరి ంది. 1990దశకం లో మాజీ మంత్రి దివంగత మాదాల. జానకిరాం చొరవతో అయ్యప్ప దేవాలయంగా తిరిగి ప్రాణం పోసుకుంది ఆ తరువాత మళ్ళీ కొన్ని సంవత్సరాలనుండి నిరాధారరణ కు గురికావటం తో దుర్గం పల్లె వాసులు కొందరు దాతలను కలిసి విన్నవించు కోగా మంచి మనసుతో స్పందించిన దాతలు అనేక రూపాలుగా సాయం అందించారు. చుట్టూ ప్రహరీ, విద్యుత్ సౌకర్యం కల్పించి మరమత్తులు చేసి పూజారిని నియమించి మళ్ళీ పూజలు ప్రారంభించారు. పక్కనే మరొక చిన్న ఆలయం మరమత్తు లు చేసే క్రమం లో అతి ప్రాచీన లోహపు నాగ పడుగ దొరికింది. దానికి ఉదయలక్ష్మి అని నామకరణం చేసి అదే ఆలయంలో ప్రతిష్ఠ చేశారు. దుర్గం చూసేదానికి వచ్చే పర్యాటకులు విధిగా దర్శించు కోవటం గురు, శుక్రవారం లలో పొంగళ్ళు పెట్టటం మళ్ళీ ఆలయం నూతన శోభ ను సంతరించుకుంది. ఇలా సాగుతున్న క్రమం లో మళ్ళీ కొన్ని సంవత్సరాలు గా నిరాదరణకు గురి అయింది. ప్రభుత్వం స్పందించి పురావస్తు శ్యాఖ ద్వారా అభిరుద్ధి జరిపి రక్షించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఉన్నతాధి కారులకు నివేదికలు పంపి ప్రతేక నిధులు అయినా తెప్పించి మరమత్తులు చేసేలా చర్యలు తీసుకోవాలి అని స్థానికులు కోరుతున్నారు.

## పంచాయతీరాజ్ ఏఇపైన చర్యలు తీసుకోవాలి



**బి.మఠం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** బి.మఠం మండలంలోని రేకలకుంట గ్రామంలో పంచాయతీ రాజ్‌కు చెందిన కాలువపనిని చేప్పట్టిన క్రమమంలో నాణ్యత లోపించిందని నాసిరకంగా నిర్మాణంచేసినారని అందువలన అక్కడ కాలువ గోడ పడిపోయినాదని బి మఠం ఈనాడు పత్రికలలో వార్త ప్రచురించిన విలేకరి సుదర్శన్ రెడ్డి పైన పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ జి ప్రతాప్ రావు తనవివరణ తీసుకోకుండా నీవు ఏలా వార్త రాస్తావు అని ప్రచార మాధ్యమాలలో తనను, తనకుటుంబాన్ని అసభ్య పదజాలంతో కించపరిచే విదంగా వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశారని నాపరువుకు భంగం కలిగించే విదంగా అనరాని మాటలు అన్నా డని ప్రతాప్ రావు పైన స్థానిక విలేకరులతో కలిసి నేడు బి.మఠం ఎస్ ఐ గారికి సుదర్శన్ రెడ్డి పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు ఈ విషయం పైన స్థానిక యెస్ ఐ విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు ఈ పిర్యాదు ఇచ్చే కార్యక్రమంలో స్థానిక విలేకరులు బాషా, రామానాయుడు, వెంకటేశ్వర్లు, రసూల్, నరసింహులు, వెంకటసుబ్బయ్య, షఫి, నాగేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

## 17న ఉదయం ఆరుగంటల నుండే బస్సులు : డి. ఎం



**ఉదయగిరి, సెప్టెంబర్ 15 వార్తావళి :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల కు ఈ నెల 17వ తేదీ న అంటే గురువారం జరుగుతున్న ఎం. సెట్. ఎంట్రన్స్ పరీక్ష లను దృష్టిలో ఉంచుకొని ఆరోజు ఉదయం ఆరు గంటల నుండే నెల్లూరు, కావలి ప్రాంతాలకు బస్సులు నడపటం జరుగుతుంది అని ఉదయగిరి ఆర్ టి సి డిపో మేనేజర్ ప్రతాప్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభం అవుతున్న దృశ్య 8.30.గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రం చేరాలి అంటే ఉదయం ఆరు గంటలకే బస్సుబయలు దేరే లా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారని వారి అవసరం మేరకు సమయం కేటాయించటం జరుగుతుందని అయన తెలిపారు.

## భారతదేశంలో పరిశుభ్రత, డిస్ ఇన్ఫెక్షన్‌ల ప్రాధాన్యతలపై హార్పిక్ ప్రత్యేక శ్రద్ధ



**విశాఖపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** సంవత్సరాలుగా, హార్పిక్ పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన పారిశుధ్య పరిష్కారాల్ని పూర్తి ప్రపంచానికి కేటాయించే దిశగా పని చేస్తోంది. భారతదేశంలో మరుగుదొడ్ల సంరక్షణ తరగతిలో నాయకునిగా, హార్పిక్ దశాబ్దాలుగా భారతదేశపు ఇళ్లల్లో ఆరోగ్యం మరియు పారిశుద్ధ్యం కోసం కృషి చేస్తోంది. హార్పిక్ టాయ్ లెట్ క్లీనర్ మరియు హార్పిక్ బాత్రూం క్లీనర్ రెండూ కూడా అంతర్జాతీయంగా గుర్తించబడిన బయటి ప్రయోగశాలలుచే పరీక్షించబడ్డాయి మరియు నీరు కలపకుండా ఉపయోగించినప్పుడు క్రిముల్ని మరియు సార్స్ -కోవ్ -2 (కోవిడ్ -19) వైరస్ లని ప్రభావవంతంగా హతమారుస్తాయని నిరూపించబడ్డాయి. తమ కుటుంబ ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని కాపాడటానికి ఇంట్లో బాత్రూంలు మరియు మరుగుదొడ్లను పరిశుభ్రంగా మరియు డిస్ ఇన్ఫెక్షన్ చేయడం పై హార్పిక్ , తన కొత్త బ్రాండ్ కాంపైన్-' సాఫ్ నహీ స్వచ్ఛ్' తో వినియోగదారులకు అవగాహన కలిగిస్తోంది. సౌత్ ఆసియా ఆర్ బీ హైజీన్,సీఎంఓ మరియు మార్కెటింగ్ డైరక్టర్ సుఖ్లీన్ అనేజా ఇలా అన్నారు, "ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన పారిశుద్ధ్యం పరిష్కారాల్ని అందుబాటులో ఉండేలా కేటాయించడంలో గత 100 సంవత్సరాలుగా హార్పిక్ ఛాంపియన్ గా ఉంది. ప్రవర్తనలో మార్పు కలిగే విధంగా దీని సమాచారం దృష్టి సారించింది. మా కొత్త ' సాఫ్ నహీ స్వచ్ఛ్' కాంపైన్ తో, తమ ప్రియతముల్ని సురక్షితంగా ఉంచడానికి ఇంట్లో గొప్ప డిస్ ఇన్ఫెక్షన్ అవలంబించాలని మేము వినియోగదారుల్ని కోరుకుంటున్నాము.హార్పిక్ టాయ్ లెట్ మరియు బాత్రూం క్లీనర్స్ గొప్ప పరిశుభ్రత మరియు డిస్ ఇన్ఫెక్షన్ ని కేటాయించడం మాత్రమే కాకుండా కోవిడ్ -19 వైరస్ ని హతమార్చడంలో కూడా ప్రభావవంతమైనదిగా గుర్తించబడింది, సాధారణంగా ఉపయోగించే డిటర్జెంట్స్ కంటే ఎంతో నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంది."

## పీఎఫ్ నుంచి వేల కోట్లు నగదు విత్ డ్రా, కేంద్ర మంత్రి



మార్చి నెలలో లాక్‌డౌన్ మొదలైన తర్వాత ఆగస్టు 31 వరకు తమ భవిష్య నిధి దాచుకున్న ఉద్యోగులు పెద్దఎత్తున నగదు విత్ డ్రా చేసుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గాంగ్వార్ వెల్లడించారు. మార్చి నెల 25 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు రూ. 39, 402.90 కోట్లను ఉద్యోగులు విత్ డ్రా చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు ఆయన పార్లమెంట్‌కు లిఖిత పూర్వక సమాధానాన్ని పంపించారు. ఈ ఐదు నెలల వ్యవధిలో మహారాష్ట్రకు చెందిన ఉద్యోగులు అత్యధికంగా నగదును విత్ డ్రా చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి రూ.7,837.80 కోట్లు విత్ డ్రా కాగా ఆ తర్వాత కర్ణాటక నుంచి రూ.5,743.90 కోట్లు, తమిళనాడు నుంచి రూ.4,984.50 కోట్లు విత్ డ్రా అయ్యాయని వెల్లడించారు. కరోనా కాలంలో కష్టాలు అనుభవిస్తున్న వలస కూలీలు కోసం కేంద్రం ప్రధాన మంత్రి గరీభ్ కల్యాణ్ యోజన, ఆత్మ నిర్భర్ భారత్ స్కీంల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలకు రూ.15 వేలు కన్నా తక్కువ వేతనం పొందుతున్న వారు లబ్ధిని పొందారని తెలిపారు. మే నుంచి జూలై వరకు ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్‌ను కూడా 12 నుంచి 10 శాతానికి తగ్గించామని సంతోష్ గాంగ్వార్ వెల్లడించారు. లాక్ డౌన్లో ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్రం అన్ని చర్యలు తీసుకుందన్నారు.

## రోజమ్మా, నువ్వు గ్రేటమ్మా



ఎపిఐఐసి ఛైర్ పర్సన్, నగరి ఎమ్మెల్యే రోజా తన గొప్ప తనాన్ని చాటుకున్నారు. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి 10 స్ట్రెచర్లను ఉచితంగా అందజేశారు. తన సొంత డబ్బులతో స్ట్రెచర్లను అందించారు. రాయలసీమ జిల్లాల నుంచి నిరుపేద రోగులు స్విమ్స్ ఆసుపత్రికి వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న రోజా ఉచితంగా స్ట్రెచర్లను అందించారు. స్విమ్స్ ఉన్నతాధికారులు రోజాతో చర్చించిన నేపథ్యంలో వెంటనే స్పందించిన ఆమె స్ట్రెచర్లను అందజేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ప్రజలకు సేవ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎపిలో ఎన్నో పథకాలను దిగ్విజయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తుంటే గత తెలుగుదేశం హయాంలో చంద్రబాబు 3 వేల కోట్ల రూపాయల అప్పులను రాష్ట్రానికి మిగిల్చారన్నారు రోజా. గతంలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగితే బిజెపి, జనసేన పార్టీలు ఎక్కడికి వెళ్ళాయంటూ ప్రశ్నించారు.



రావణాపల్లి గ్రామంలో వైఎస్సాఆర్ పొలంబడి కార్యక్రమం ఎఒ మధుసూదనరావు గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ సర్పంచ్ కొల్లు సత్యనారాయణ, కిలపర్తి పెద్దిరాజు, గంగునాయుడు, రాము, చిన్తతాలు, ఎఇఒ సురేష్, దివ్య, వాలంటీర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

**- వార్తావళి, రావణాపల్లి**

## అస్సాంలో హిందూ దేవాలయాల నిర్మాణానికి మరమ్మతులు



**అస్సాం:** అస్సాంలో హిం దూ దేవాలయాల ని ర్మాణానికి, మరమ్మతులకు ఆర్థిక సాయం చేస్తూ ఓ ముస్లిం జంట మతసామ రస్యానికి ప్రతీకగా నిలు స్తోంది. 39 ఏళ్ల హామిదుర్ రహమాన్, ఆయన భార్య పార్సియా సుల్తానాలు అసోంలోని జోర్‌హాట్ జిల్లాలో కొన్ని హిందూ మందిరాల నిర్మాణాలు, మరమ్మతులు చేయించారు. మసీదులకూ కూడా వీరు సాయం చేస్తున్నారు. తమకు సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో రహదారులు కూడా వేయించారు.



చిత్తూరు జిల్లాసదుం మండలం చింతపర్తివారిపల్లి వద్ద నడిమోడు కుంటలో తేలిన ఇద్దరు చిన్న పిల్లలు మృతదేహాలు వివరాలు తెలియల్సి ఉంది. ఇద్దరు బిడ్డలను చెరువులో వేసి... విషం తాగి చెరువులో దూకిన ఇద్దరు వ్యక్తులు... బిడ్డలు మృతి... అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని అంబు లెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన పోలీసులు.... ఇద్దరు భార్యా భర్తలు కారు... అక్రమ సంబంధం కారణమని ప్రాథమిక విచారణలో పోలీసుల వెల్లడి

**- వార్తావళి, చిత్తూరు**

## శానిటైజర్ తాగి యువతీ ఆత్మహత్యాయత్నం !



**విశాఖపట్నం తూర్పు, వార్తావళి, సెప్టెంబర్ 15 :**విశాఖలో దారుణ సంఘటన జరిగింది. ఓ మహిళ శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అనుచరుడు ఈగల సత్యం వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకి పాల్పడింది. బాకీ డబ్బుల కోసం ఈగల సత్యం వేధింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. దీనితో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అనుచరుడు ఈగల సత్యం అరాచకానికి పాల్పడ్డాడు. నడిరోడ్డుపై అతడు చేసిన దాష్టీకాన్ని తట్టుకోలేక వివాహిత శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. బాధితురాలి కొడుకు నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్తారు. పెద వాల్తేరు ప్రాంతంలో ఎస్తేరు రాణి అనే మహిళ రోడ్డు పక్కన హోటల్ నడుపుతుంది. ఈ క్రమంలో అదే ప్రాంతం లో నివసిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే రామకృష్ణ బాబు అనుచరుడు ఈగల సత్యం తరచూ బాధిత మహిళ హోటల్ కి వెళ్లేడమే కాకుండా అక్కడ హోటల్ కొనసాగాలంటే తన ఆశీస్సులు ఉండాలని బెదిరించేవాడు. అంతేకాదు తనతో సన్నిహితంగా మెలగకపోతే లక్ష రూపాయలు అప్పు తీసుకుని ఎగ్గొట్టినట్టు ఎస్తేరు రాణి పై తప్పుడు కేసు పెడతానని బెదిరించేవాడట. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కూడా బాధితురాలిని తన తోనే ఉండాలని బెదిరించాడని సమాచారం. అంతేగాక నడి రోడ్డుపైనే విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఈ అవమానం తట్టుకోలేక ఆ బాధితురాలు శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే స్థానికులు ఆమెను కేజీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఈగల సత్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు పోలీసులను డిమాండ్ చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో వాహనదారులకు షాక్



ఏపీలో ట్రాఫిక్ రూల్స్ మరింత కఠినతరం కానున్నాయి. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే చలాన్లు ఇంటికి వస్తాయని ప్రతి ఒక్కరికి తెలుసు. అయితే రూల్స్ అతిక్రమించిన వారికి ఫైన్ వేస్తున్న ఏపీ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను మరింత కఠిన తరం చెయ్యనున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ విషయంలో ఇప్పటికే కఠిన నిర్ణయం తీసుకున్న ఏపీ సర్కార్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే అనవసరంగా ఇబ్బంది పడతారు అని హెచ్చరిస్తోంది. ఏపీ, తెలంగాణా బస్సుల రవాణాపై వీడని సస్పెన్స్ ... నేడు మరోమారు భేటీ .. చర్చలు ఫలిస్తాయా!!

**హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ .. వెయ్యి రూపాయలు జరిమానా ..3నెలలు లైసెన్స్ క్యాన్సిల్**

హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు దొరికితే వెయ్యి రూపాయలు జరిమానా కట్టాలని, మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ పై అనర్హత వేటు కూడా పడుతుంది అని హెచ్చరిస్తోంది ఏపీ సర్కార్. కేంద్రం నూతన మోటార్ వాహన చట్టం అమలు అయితే వాహనదారులకు చుక్కలు కనిపిస్తాయని చెప్తున్నారు . గతేడాది సెప్టెంబర్ 1 నుండి కొత్త మోటారు వాహన చట్టం అమలులోకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే . అయితే ఈ చట్టం లో ఉన్న 11 సెక్షన్లలో జరిమానాలు తగ్గించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పించింది.

**కేంద్ర ఆదేశాల మేరకే వాహన చట్టం అమలు**

కేంద్రం కొత్త మోటార్ వాహన చట్టం విషయంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు మరో 20 సెక్షన్లలో కూడా జరిమానాలు తగ్గించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పించాలని కోరాయి. దీనిపై కేంద్ర సుప్రీంకోర్టు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సూచనలు చేయాల్సిందిగా పేర్కొంది. సుప్రీంకోర్టు నిపుణుల కమిటీ కేంద్రం సవరించిన చట్టాన్ని అమలు చేయాలని, ప్రమాదాలను తగ్గించడానికి ఇది దోహదం చేస్తుందని పేర్కొంది. దీంతో కొత్త మోటార్ వాహన చట్టంలో రాష్ట్రం ప్రతిపాదించిన 20 సెక్షన్లలో జరిమానాను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు ఇవ్వడం సాధ్యం కాదని, సడలింపులు ఉండబోవని కేంద్రం తేల్చిచెప్పింది.

**ఏపీలో కొత్త వాహన చట్టం అమలుకు రంగం సిద్ధం**

దీంతో అన్ని రాష్ట్రాలు కేంద్రం అమలులోకి తీసుకువచ్చిన మోటార్ వాహన చట్టాన్ని ఆయా రాష్ట్రాలలో అమలు చెయ్యాల్సిందే అని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో తాజా సవరణలకు తగ్గట్టుగా ఏపీలో కొత్త మోటారు వాహన చట్టం అమలు చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది ఏపీ సర్కార్. ఇందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై ఉక్కు పాదం మోపడానికి సిద్ధమైన ఏపీ సర్కార్, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జైలుకే అని గతంలోనే పేర్కొంది. ఇప్పుడు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా సరే కఠిన చర్యలే అంటుంది.

**రెడీ అయిన రవాణా శాఖ ... త్వరలోనే నోటిఫికేషన్**

ఇప్పటికే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను రవాణాశాఖ ప్రభుత్వానికి పంపించగా, ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆమోద ముద్ర పడిన వెంటనే అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వాహనచోదకులు ఎటువంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా జేబులు గుల్ల చేసుకోవాల్సిందే. అంతేకాదు జైలు శిక్షలు, డ్రైవింగ్ లైసెన్స్ పై అనర్హత వేటు తదితర చర్యలకు ఏమాత్రం వెనుకాడేది లేదని ఏపీ ప్రభుత్వం తేల్చి చెబుతోంది.




## ఆంధ్రాకు ప్రత్యేక హెూదాపై గళం విప్పాలి

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బొట్టా చిన్నియాదవ్



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయినా నేపథ్యంలో ,పార్లమెంటు సమావేశాలలో రాష్ట్ర ఎంపీలు ఆందరూ, ఆంధ్రకు ప్రత్యేక హెూదా ప్రకటించాలని, విభజన హామీలను నెరవేర్చాలని పార్లమెంట్లో గళం విప్పి కేంద్రాన్ని ఒప్పించాలని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు అంశంపై గట్టిగా తమ వాణి వినిపించాలని ,కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో,రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగే విధంగా కృషి చేయవలసిందిగా పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నామని చిన్న యాదవ్ అన్నారు. ప్రశ్నోత్తరాల రద్దుపై ప్రశ్నించాలి, ప్రశ్నోత్తరాల సమయం చట్టపరంగా సభ్యులకు ఉండే హక్కు అని, దాన్ని ఎత్తివేయడంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ హక్కులను కాలరాస్తుందని, చేసిన తప్పులను సభ్యులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనె ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తుందని, ప్రతి పార్లమెంట్ సభ్యుడు మాట్లాడే ఏకైక అవకాశాన్ని కూడా కేంద్రం తొలగించడం అన్యాయమని , రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమాధానం రాబట్టుకునే ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేయడం సరైన పద్ధతి కాదని , యాదవ్ అన్నారు.

## డిసిసి కార్యదర్శిగా తుట్టా రమణ



**యలమంచిలి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) కార్యదర్శిగ అనకాపల్లి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుట్టా రమణ నియమితులైనారు. ఈ నియమక ఉత్తర్వులను డిసిసి అధ్యక్షులు రుత్తల శ్రీరామ్మూర్తి జారీ చేసారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఐ.ఆర్.గంగా ధర్ తుట్టా రమణ కి నియమక ఉత్తర్వులను అందజేసారు. ఈ సందర్భంగ గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో తుట్టా రమణ కి జిల్లా కాంగ్రెస్ కమిటీ లో స్థానం కల్పించటం ద్వారా అత్యంత వెనుకబడిన కులాలకు (ఎమ్ బి సి) రాజకీయ అవకాశాలు కల్పించిన డిసిసి అధ్యక్షులు రుత్తల శ్రీరామ్మూర్తికి కృతజ్ఞతలు తెలియజేసారు. జిల్లాలో అణగారిన వర్గాల సమస్యల పై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని గంగాధర్ తెలిపారు. దేశంలో మ్హెడీ పాలనలో బడుగు,బలహీన వర్గాల ప్రజలు ఫ్పర్తి వివక్షతకు గురౌతున్నారని విమర్శించారు. ముందస్తు ప్రణాళిక లేకుండ,రాష్ట్రాలతో సంప్రదించకుండ ఏకపక్షంగ లాక్ డౌన్ విధించటం వలన కోట్లాది శ్రమ జీవులు రోడ్డు పడ్డారని విమర్శించారు. మ్హెడీ పాలన సంపన్నులను అనుకూలంగాను,పేదల,మధ్యతరగతి వారికి వ్యతిరేకంగాను ఉందని అన్నారు. రానున్న రోజులలో మ్హెడీ విధానాలకు వ్యతిరేకంగ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగ పటిష్టం చేయుటలో కార్యకర్తలు,నాయకులు శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి సంతోష్,అనకాపల్లి మండల కాంగ్రెస్ కమిటీ కన్వీనర్ ఎగ్గాడ భాస్కరరావు,జిల్లా కాంగ్రెస్ బి.సి.సెల్ నాయకుడు గౌరీపట్నపు గున్నబాబు మ్నెదలగు వారు మాట్లాడారు.

## ప్రధాని నరేంద్ర మోది జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 15 :** కశింకోట గ్రామంలోని ఆదివారం నరేంద్ర మోడి 70 వ జన్మ దిన వేడుకలు లో భాగంగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాబాగంగా రోకల్లతిరుమల సంరక్షణ బాద్యత తో 70.మొక్కల నాటడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.జె. పి. జిల్లా అధ్యక్షుడు గండి వెంకట సత్యనారాయణ విచ్చేసిరి, మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరికీ బాధ్యత ఉండాలి అని, చెట్లు పెంచితే అందరూ ఆరోగ్యం గా ఉంటారు అని తెలియజేశారు. కార్యక్రమం లో పాల్గొన్నా వారు ద్వారా పురెడ్డి పరమేశ్వర రావు, ఎం ఎం నాయుడు .అలమండశ్రీను. ఎస్ అప్పారావు. ఎన్.సన్యాసి రావ్, కె. వి రమేష్. కె.హరనాథ్ యస్సీ మోర్చా డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ ఏ. కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాక్సిన్ తొలి ప్రయోగం నామీదే



వ్యాక్సిన్ తొలిసారిగా వేసుకునేందుకు ఎవరూ ముందుకు రాని పక్షంలో తానే తొలుతగా ముందుకు వస్తానని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ ప్రకటించారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో పాటు అవసరమైనంత వరకు అధికంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత మనదేశంలో తయారైన వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని ఆశాభావంతో ఉన్నామన్నారు. దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ కంట్రోల్ రాకపోవడంతో వ్యాక్సిన్ తయారీ మరింత వేగవంతమైంది. ఇప్పటికే చాలా ఔషధ సంస్థలు రెండో దశ ప్రయోగాలు పూర్తిచేసుకొని మూడో స్టేజ్‌కి ప్రవేశించాయి. ఇక భారత్ లోను కరోనా వ్యాక్సిన్ ప్రయోగాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే దేశంలో వైరస్ వ్యాప్తి, వ్యాక్సిన్ తయారీపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2021 ఫిబ్రవరి, మార్చి నెలల్లో కరోనా విరుగుడు అందుబాటులోకి వచ్చే అవకాశముందన్నారు. వైరస్ పైన పోరులో ముందుండి ప్రజలను రక్షిస్తున్న వైద్యులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బందికి తొలుత వ్యాక్సిన్‌ను అందుబాటులోకి ఉంచుతామన్నారు. అయితే ప్రయోగాలు అనంతరం తొలి వ్యాక్సిన్ తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోతే తానే స్వయంగా వ్యాక్సిన్‌ను వేసుకుంటానని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ స్పష్టం చేశారు. టీకాపై ప్రజలకు మరింత భరోసా కల్పించడానికి తొలి ప్రయోగంగా తాను అందుబాటులో ఉంటానన్నారు.

## డీఆర్డోవో మరో ఘనత.. అగ్రదేశాల సరసన భారత్



డీఆర్డీవో (డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్) సాధించిన ఓ అరుదైన ఘనతతో మనదేశం.. అగ్రరాజ్యాలైన అమెరికా రష్యా చైనా సరసన నిలిచింది. ఇంతకూ డీఆర్డీఏ సాధించిన ఆ ఘనత ఏమిటంటే.. హైపర్సానిక్ టెక్నాలజీని ఇటీవల డీఆర్డీఏ విజయవంతంగా పరీక్షించింది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరలోనే దేశీయంగా అభివృద్ధి చేయనున్నారు. కేవలం అమెరికా రష్యా చైనా మాత్రమే చేసే ఈ పరీక్షను డీఆర్డీఏ విజయవంతంగా పూర్తిచేసింది. ఆయుధాల తయారీలోనూ డీఆర్డీవో దూసుకుపోతోంది. అత్యంత శక్తివంతమైన లేజర్లు అధికశక్తితో కూడిన మైక్రోవేవ్ వంటి ఆయుధాల తయారు చేసేందుకు కూడా డీఆర్డీవో ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్లో ఇవి భారత్కు కీలక ఆయుధాలుగా మారనున్నాయి. శత్రుదేశాలు ప్రయోగించే క్షిపణులు యుద్ధవిమానాలను అడ్డుకొనేందుకు ఓ బలమైన ఆయుధాన్ని రూపొందించేందుకు డీఆర్డీయే యత్నిస్తోంది. ' కెమికల్ ఆక్సిజన్ అయోడిన్ ' 'హైపవర్ ఫైబర్' నుంచి వెలువడే రహస్య లేజర్లతో నడిచే ఓ ఆయుధాన్ని డీఆర్డీఏ తయారు చేయబోతోంది. ఈ ఆయుధం శత్రుదేశాల క్షిపణులను యుద్ధవిమానాలను తేలికగా అడ్డుకోగలుగుతుందని డీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు రెండు యాంటీ-డ్రోన్ డీఈడబ్ల్యూ వ్యవస్థలను అభివృద్ధి చేసిన డీఆర్డీఓ... ప్రస్తుతం వీటిని భారీగా ఉత్పత్తిచేయాలని యోచిస్తోంది. రెండు కిలోమీటర్ల పరిధిలో వైమానిక లక్ష్యాలను ఛేదించడానికి ఓ ఆయుధాన్ని డీఆర్డీఏ రూపొందించబోతోంది. ఈ ఆయుధం 10 కిలోవాట్ల లేజర్ సామర్థ్యంతో పనిచేస్తుందని.. ట్రైలర్ మౌంటెడ్ డ్రోన్ కిలోమీటరు పరిధిలోని శత్రువుల లక్ష్యాలను చేరుకునే రెండు కిలోవాట్ల లేజర్ కాంపాక్ట్ ట్రైపాడ్-మౌంటెడ్ను రూపొందించినట్టు డీఆర్డీఏ పేర్కొంది.

## నాడు - నేడు పనులు వేగవంతం చేయండి

### ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి కూర్మనాథ్



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు - నేడు కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. సబ్ ప్లాన్ మండలాల గ్రామాల్లో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐ.టి.డి.ఏ, ప్రాజెక్ట్ అధికారి ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాజెక్ట్ అధికారి తన ఛాంబర్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేపట్టిన పనులలో నేటికీ ఏయే స్థాయిలలో ఎన్ని పనులు ఉన్నాయనే అంశాల పై సమీక్ష చేసిన అనంతరం ప్రాజెక్ట్ అధికారి పనులు త్వరితగతిన పుర్తియేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. అటవీ అనుమతులు పొందిన రోడ్ల పనులు వేగవంతం చేయాలని పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలు వుంటే వెంటనే తెలియజేస్తే సత్వరం పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇ.ఇ జె.శాంతీశ్వర రావు, డి.ఇ తిరుపతి నాయుడు హాజరయ్యారు.

## ఎవరో చేసిన పనికి ఇండస్ట్రీ మొత్తాన్ని విమర్శించడం సరికాదు



అమితాబ్ బచ్చన్ భార్య, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ మాట్లాడుతూ, ఎవరో చేసిన పనికి ఇండస్ట్రీ మొత్తాన్ని విమర్శించడం సరికాదని అన్నారు. ఈ నేపథ్యంలో, జయాబచ్చన్ కు శివసేన మద్దతుగా నిలిచింది. బాలీవుడ్ లో ప్రతి ఇక్కరికీ డ్రగ్స్ తో సంబంధం ఉందని అనడం సరికాదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. జయాబచ్చన్ కూడా ఇదే అన్నారని... ఆమె మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దాదాపు 5 లక్షల మంది బతుకుతున్నారని సంజయ్ రౌత్ అన్నారు. అలాంటి పరిశ్రమ గౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు చేసిన వ్యాఖ్యలను జయ తప్పుపట్టారని చెప్పారు. మరోవైపు జయాబచ్చన్ పై కంగనా రనౌత్ కూడా మండిపడ్డ సంగతి తెలిసిందే.

# పకడ్బందీగా రిక్రూట్‌మెంట్ పరీక్షలు

**విశాఖపట్నం ఉత్తరం, వార్తావళి, సెప్టెంబర్ 15 :** పకడ్బందీగా గ్రామ, వార్డు సచివాలయ రిక్రూట్ మెంట్ పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ తెలిపారు. మంగళవారం నాడు స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది రిక్రూట్ మెంట్ పరీక్షలు నిర్వహించే అధికారులు, పరీక్షల ప్రారంభానికి ముందు, జరుగుతున్న సమయంలో , పూర్తయిన తర్వాత చేయవలసిన పనుల మీద పూర్తి అవగాహనతో శ్రద్ధ తో పని చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సీరియస్ గా తీసుకోవాలని కమిట్ మెంట్ తో పని చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణ లో చిన్న చిన్న పొరపాట్లు కూడా జరగకుండా సక్రమంగా సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు విద్యుత్,గాలి, వెలుతురు సక్రమంగా అందే విధంగా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఆయన అన్నారు. పోలీసు శాఖ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూములకు భద్రత కల్పించాలని, రూట్ అధికారులు మెటీరియల్ తీసుకు వెళ్ళేటప్పుడు ఎస్కార్ట్ ఇవ్వాలని తెలిపారు. ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న సచివాలయ ఉద్యోగాల రాతపరీక్షల నిమిత్తం కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా పరీక్షా కేంద్రాలవద్ద పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతీ అభ్యర్థికీ థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించి, శరీర ఉష్ణోగ్రతను తనిఖీ చేయాలన్నారు. శానిటైజర్ వేసి, చేతులు శుభ్రం చేసుకున్న తరువాతే లోపలికి పంపించాలని చెప్పారు. మాస్కులు ధరించిన వారిని మాత్రమే లోపలికి అనుమతించాలని, అవసరమైతే ఉపయోగించడానికి ప్రతీ కేంద్రంలో మాస్కులను కూడా రిజర్వులో ఉంచాలని సూచించారు. కోవిడ్ పాజిటివ్ రోగులు పరీక్షలు రాసేందుకు అనుగుణంగా ప్రతీ పరీక్షా కేంద్రం వద్దా ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంవద్ద 2 ఎఎన్ఎం లను, 2 ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేయాలని, శానిటైజర్లు, మాస్కులు, థర్మల్ స్కానర్ లు, పల్స్ ఆక్సీమీటర్, అవసరమైన మందులను కూడా సిద్దంగా ఉంచాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకొనేందుకు వీలుగా ఆర్‌టిసి అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. మెటీరియల్ తీసుకు వెళ్ళేందుకు డిజిటి బస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. మొత్తం 1,50,441 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు, ఉదయం 10 నుంచి 12.30, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతీ అభ్యర్థి కనీసం 45 నిమిషాల ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉందన్నారు. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల మధ్య భౌతిక దూరాన్ని పాటించేందుకు అనువుగా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెంటర్ల స్పెషల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఛీఫ్ సూపరింటిండెంట్లు, అదనపు ఛీఫ్ సూపరింటిండెంట్లు, హాల్ సూపరింటిండెంట్లను, ఇన్విజిలేటర్లను నియమించినట్లు వారికి సమగ్ర శిక్షణ ను ఇచ్చినట్లు వివరించారు. ఈ సమావేశంలో రూరల్ పోలీసు సూపరింటెండెంట్ కృష్ణా రావు, జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జీవియంసి కమీషనర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ గోవింద రావు, నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్. మౌర్య, డి ఆర్ ఓ ఎ.ప్రసాద్, ఆర్డీఓ కిషోర్, జిల్లా పరిషత్ సిఈఓ నాగార్జున సాగర్, డిపిఓ కృష్ణ కుమారి, డిఎంహెచ్ఓ విజయ లక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, డిటిసి రాజారత్నం, ఈపీసీడీఎల్ ఎస్ ఈ సూర్య ప్రతాప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐక్యరాజ్య సమితి కీలక విభాగంలో భారత్‌కు చోటు



ఐక్యరాజ్య సమితిలోని కీలక విభాగంలో భారత్‌కు చోటు దక్కింది. దీన్ని డ్రాగన్ కంట్రీ జీర్ణించుకోలేకపోతోంది. దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు రోజురోజుకూ పెరిగిపోతోంది. తాజాగా ఐక్యరాజ్య సమితిలోని ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్ (ఈసీఓఎస్ఓసీ)కి చెందిన 'యూఎన్ కమిషన్ ఆన్ స్టేటస్ ఆఫ్ ఉమెన్'లో భారత్‌కు సభ్యత్వం లభించింది. ఇందుకోసం జరిగిన ఎన్నికల్లో భారత్‌తోపాటు చైనా, ఆఫ్ఘనిస్థాన్ కూడా బరిలో నిలిచాయి. చైనాను ఓడించిన భారత్‌కు సభ్యత్వం లభించింది. ఈ సందర్భంగా ఐరాసలోని భారత శాశ్వత రాయబారి తిరుమూర్తి మాట్లాడుతూ.. లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ విజయం గుర్తింపు వంటిదన్నారు. ఈ సందర్భంగా తమకు మద్దతుగా నిలిచిన సభ్యదేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపుతో యూఎన్ కమిషన్ ఆన్ స్టేటస్ ఆఫ్ ఉమెన్‌లో భారత్ సభ్యత్వం ఐదేళ్లపాటు అంటే 2025 వరకు ఉంటుంది. ఇక, సభ్యత్వం కోసం పోటీపడిన ఆఫ్ఘనిస్థాన్ బ్యాలెట్ ఓట్లు సాధించి గౌరవాన్ని నిలబెట్టుకోగా, చైనా మాత్రం దారుణంగా ఓటమి పాలైంది. బ్యాలెట్‌కు కావాల్సిన ఓట్లలో సగం కూడా సంపాదించుకోలేకపోవడం గమనార్హం.

## హైదరాబాద్ - ముంబైల మధ్య బుల్లెట్ రైలు...



దేశంలోని రెండు పెద్ద మహానగరాల మధ్య బుల్లెట్ రైలు రానుంది. ముంబై - హైదరాబాద్‌ల మధ్య బుల్లెట్ రైలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు కోసం డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను తయారు చేయాల్సిందిగా సంబంధింత శాఖ అధికారులను కోరింది. దేశవ్యాప్తంగా ఏడు కొత్త మార్గాలకు సంబంధించి డీపీఆర్ (ప్రాజెక్టు పూర్తి నివేదిక) సిద్ధం చేయాలని హైస్పీడ్ రైలు కార్పొరేషన్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్)ను కేంద్రం ఆదేశించిందని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం దాదాపు రూ.10 లక్షల కోట్లని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే దేశంలో అహ్మదాబాద్ - ముంబైల మధ్య దేశంలోనే తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టును కేంద్రం చేపట్టిన విషయం తెల్సిందే. మొత్తం 508.17 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టు ఇప్పటికే ప్రారంభం కాగా, దీని అంచనా వ్యయం రూ.1.08 లక్షల కోట్లు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు డిసెంబరు 2023 నాటికి పూర్తికావాల్సివుంది. కానీ, భూసేకరణ సంబంధిత సమస్యలు, కరోనా వంటి సమస్యల కారణంగా ఇది అక్టోబరు 2028 నాటికి వాయిదా పడే అవకాశాలున్నట్టు కేంద్ర రైల్వే వర్గాల సమాచారం.

## అతడికి ప్రతీ సెకండ్‌కు 3 లక్షల ఆదాయం



మనపై వర్షం కురిస్తేనే తడిసి ముద్దవుతాం.. కానీ ఆయనపై కాసుల వాన కురుస్తోంది. కళ్లు మూసి తెరిచే సెకన్ కాలంలోనే ఆయనపై 3 లక్షలు వచ్చి పడుతున్నాయి. ఇంతటి సంపాదనను ఏం చేస్తాడు? ఎలా ఖర్చు పెడుతాడు? వేలు సంపాదించడానికి మనం ముక్కీ ములిగి నెలంతా గొడ్డు చాకిరీ చేస్తుంటే.. సెకనుకు 3 లక్షలు సంపాదించే ప్రపంచంలోనే అత్యంత కుబేరుడైన నంబర్ 1 ధనవంతుడు ఇక ఎలా ఫీల్ అవ్వాలి? ఆ ఫీలింగ్ మాటలకు అందనిదీ.. ఆయన ఎవరో కాదు.. అమేజాన్ అధినేత జెఫ్ బెజోస్..ప్రపంచంలోనే నంబర్ 1 ధనవంతుడిగా మారిన జెఫ్ బోజెస్ నిజానికి మొదట్లో చిన్నా గ్యారేజ్ తోనే సంసారం సంపాదన మొదలు పెట్టాడు. 1995లో ఓ చిన్న గ్యారేజ్ లో అమేజాన్ ఆఫీస్ ను ప్రారంభించిన జెఫ్ బెజోస్ నేడు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా మారడం వెనుక అతడి కృషి పట్టుదల ఉంది. ఇంటర్ నెట్ ప్రభావాన్ని మొదట్లోనే అంచనావేసిన జెఫ్ తన పుస్తక దుకాణాన్ని ఆన్ లైన్ లో ప్రారంభించాడు. తర్వాత అన్ని పుస్తకాలను ఆన్ లైన్ లో అమ్మడం మొదలుపెట్టి సంపదను అనేక రెట్లు సృష్టించాడు. ఒకప్పుడు పొట్టకూటి కోసం మెక్ డొనాల్డ్స్ లో పనిచేసిన జెఫ్ ఇప్పుడు సెకనుకు రూ. 3లక్షలు సంపాదిస్తున్నాడని తెలిసింది. అలా ఎవరికైనా జీవితంలో ఒకే ఒక టర్నింగ్ పాయింట్ ఉంటుంది. ఆలోచనలకు రెక్కలొస్తే ఆదాయం దానంతట అదే పెరుగుతుంది. కావాల్సిందల్లా దానిని ఆచరణలో పెట్టడమే. ప్రపంచంలోనే ఆన్ లైన్ మార్కెట్ తో కోట్లు సంపాదిస్తున్న జెఫ్ బెజోస్ ఇప్పుడు అందరికీ ఆదర్శం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## వేరే దేశాలకు లేని సమస్య అమెరికాకు మాత్రమే ఉంది: డొనాల్డ్ ట్రంప్



అమెరికా అడవుల్లో తరుచూ అగ్నిప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు, వీటిపై స్పందించిన ట్రంప్ తరచూ రాజుకుంటున్న అడవుల సమస్య అమెరికాలో మాత్రమే ఉందని ఇది వేరే దేశాలలో లేవని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో అడవుల్లో రాజుకున్న మంటలు అనేక రాష్ట్రాలకు విస్తరించి 35 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అంశాన్ని ట్రంప్ తన ప్రచారంలో ఈ కార్చిచ్చు గురించి ప్రస్తావించనే లేదని విపక్షాలు నిలదీసిన వేళ ఆయన ఫైర్ ఫైటర్స్‌తో సమావేశమై పరస్థితిపై చర్చించారు. ఆపై మీడియాతో మాట్లాడుతుండగా వాతావరణ మార్పుల కారణంగానే అడవులు మండుతున్నాయా, అనే ప్రశ్న ఎదురైన వేళ ట్రంప్ స్పందించారు. అన్ని దేశాలలో మంటలు అంటుకునే చెట్లున్నాయని కానీ అమెరికాలో ఉన్న సమస్య వేరేననీ, అది ఏ ఇతర దేశాలలో లేవని ట్రంప్ తెలిపారు.



నర్సీపట్నం రూరల్ వై.యస్.ఆర్ ఆసరా వారోత్సవాలో పాల్గొన్న గౌరవ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్

– వార్తావళి విలేకరి, నర్సీపట్నం



మాకవరపాలెంలో ఆసరావారోత్సవాలు కార్యక్రమంలో పెట్ల ఉమా శంకర్ గణేష్.

– వార్తావళి, మాకవరపాలెం



గొలుగొండ మండలంలో వైస్సార్ ఆసరా చెక్కులను మన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గారి చేతులమీదుగా మరియు రావణాపల్లి మాజీ సర్పంచ్ కొల్లు సత్యనారాయణ, కిలపర్తి పెద్దిరాజు అందజేయడం జరిగింది.

– వార్తావళి, గొలుగొండ



# విశాఖపట్నం వార్తలు

## ట్రావెల్ ఇండస్ట్రీకి మద్దతు ఇవ్వాలి



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 15:** ట్రావెల్ ఏజెంట్లు / టూర్ ఆపరేటర్లను సేవ్ చేయమని మరియు ట్రావెల్ ఇండస్ట్రీకి మద్దతు ఇవ్వమని ఆంధ్రా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. విజయ్ మోహ పిలుపునిచ్చారు మరియు జిడిపిలో 10% తోడ్పడండి మరియు మేము కూడా మీరు సేవ్ చేయమని అభ్యర్థిస్తున్నాము ఆన్‌లైన్ ట్రావెల్ పోర్టల్స్‌తో చైనా అంతరించిపోకుండా ప్రయాణించే పరిశ్రమ మాపై ఆర్థికంగా వేధిస్తోంది మరియు టిసిఎస్‌ను ఉపసంహరించుకుంటుంది మిస్టర్ విజయ్ మోహన్ అన్నారు మేము “టూరిజం” అనగా ఈ పాండమిక్ పరిస్థితిలో ప్రభావం చూపిన టాండ్ మోస్ట్ నిర్లక్ష్యం చేయబడిన పరిశ్రమ గురించి ప్రయాణం ఎక్కువగా మాట్లాడుతుంది. ప్రభుత్వాలు మరియు ప్రజల నుండి సానుభూతి, తాదాత్మ్యం లేదు. ప్రయాణ పరిశ్రమ దివాలా, వ్యాపారాల మూసివేత మరియు సామూహిక నిరుద్యోగం వైపు చూస్తోంది. ట్రావెల్ ఏజెంట్ల మూలధనం తుడిచిపెట్టుకు పోయింది, ఆదాయం మరియు సంపద క్షీణించింది, ఏజెంట్లు తమ వ్యాపారాన్ని మూసివేస్తున్నారు, వారి ఉద్యోగులను తొలగించారు మరియు ట్రావెల్ ఏజెంట్ల ధైర్యాన్ని జిడిపిలో 10% వాటా ఇచ్చే పరిశ్రమకు కోల్పోయింది. అవసరమైన సమయంలో మేము ఒంటరిగా ఉన్నాము. కరోనా వైరస్ ట్రావెల్ ఇండస్ట్రీని దెబ్బతీసింది మరియు వైరస్ యొక్క క్యాస్కేడింగ్ ప్రభావం పరిశ్రమను నిర్వీర్యం చేసింది మరియు ఈ రకమైన కరిగిపోవడాన్ని మనం ఎప్పుడూ చూడలేదు. మిగతా భారతదేశం వాస్తవానికి ఎండ్ మార్చిలో మూసివేయబడింది, జనవరి నుండి ట్రావెల్ ఏజెంట్ల వ్యాపారం మూసివేయబడింది, డిసెంబర్ నుండి వైరస్ యొక్క వార్తలు మొదలయ్యాయి, ఇది ట్రావెల్ పరిశ్రమ మాత్రమే, ఇది ఏ పరిశ్రమకన్నా చాలా ముందుగానే మూసివేయబడింది మరియు ఇప్పటికీ మూసివేయబడింది డౌన్. అసోసియేషన్ యొక్క రహస్యం మిస్టర్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ట్రావెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిశోధన టెలిస్కోపులు ఖగోళ వస్తువుల రసాయన శాస్త్రం మరియు ఇతర లక్షణాలను అధ్యయనం చేయడంలో శాస్త్రవేత్తలకు ఉపయోగపడింది. అయితే మరో కొందరు శాస్త్రవేత్తలు మాత్రం పాస్ఫిన్ ఉన్నంత మాత్రాన జీవం ఉండగలని చెప్పలేమంటున్నారు. ఈ సందర్భంగా కార్డిఫ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీకి చెందిన లీడ్ రచయిత జేన్ గ్రీవ్స్ ఏఎఫ్ పీ తో మాట్లాడుతూ.. 'ఫాస్ఫైన్ ఉన్నంత మాత్రాన ఆ గ్రహం మీద జీవం ఉందని చెప్పలేం. ఒక గ్రహం మీద భాస్వరం సమృద్ధిగా ఉన్నప్పటికీ.. జీవం మనుగడకు సంబంధించిన ముఖ్యమైనది అక్కడ లేకపోవచ్చు. ఇతర మూలకాలు ఉండటం వల్ల అక్కడ పరిస్థితులు చాలా వేడిగా.. పొడిగా ఉండవచ్చు' అని తెలిపారు. అయితే భూమి కాకుండా వేరే రాతి గ్రహం మీద ఫాస్ఫైన్ కనుగొనడం ఇదే మొదటిసారి అన్నారు. భూమిపై ఫాస్ఫిన్ ఉత్పత్తి చేయడానికి ఖనిజాలు లేదా జీవ పదార్థాల నుండి బ్యాక్టీరియా ఫాస్ఫేట్ తీసుకొని హైడ్రోజన్ను జోడిస్తుంది.

## ఉద్యమకారులపై కేసులు బనాయిస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 15:** ఢిల్లీలో అల్లర్లకు కారణమైన విద్రోహులను వదిలి ఉద్యమకారులపై కేసులు బనాహిస్తున్న ఎన్ ఐ ఎ కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం ముందు ప్రజా, పౌర సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జె వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సిఎఎ, ఎన్ఆర్సి,ఎన్పిఆర్, వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, మేధావి వర్గాలపై అక్రమ అరెస్టులు పూనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. భీమాకోరేఘావ్ అల్లర్లలో కారకులైన ఆర్ ఎస్ ఎస్,బీజేపీ మతోన్మాద శక్తులను వదిలి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న ఉద్యమకారులపై కేసులు బనాయించి అరెస్టులు చేసి జైలుకు తరలించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎమ్ లక్ష్మీ,ఎ పి మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ విమల, ఐఎఫ్‌టియు ఎం వెంకటేశ్వర్లు, ఎఐఎఫ్‌టియు గణేష్ పాండా, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె రెహమాన్, డిహెచ్‌పిఎస్ నగర కార్యదర్శి జి రాంబాబు, శ్రామిక మహిళా సమాఖ్య నాయకులు వెంకటలక్ష్మి,మురికివాడల సంఘం నాయకులు లక్ష్మీ నారాయణ, బాలనగమ్మ,పి లక్ష్మి, ఎఐవైఎఫ్ నుంచి మదురెడ్డి, ఎఐవైఎస్ఎఫ్ నాయకులు వై అప్పలరాజు,చిల్లర వర్తకుల సంఘం నుంచి టి వి రావు, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నుంచి ఎం పైడిరాజు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోషాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 15:** ప్రధాని మంత్రి మోడీ జన్మదిన సందర్భంగా మంగళవారం ఘోషాసుపత్రిలోని రోగులకు ఎమ్మెల్సీ మాదవ్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నేతగా భారత ప్రధాని మోడీ గుర్తింప పద్దారని ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా ఆరువేల రూపాయలు నగదు మరియు పసిపిల్లలకు కిట్స్ ఇస్తున్నారని ప్రతి నెల 9వ తారీఖు నాడు గర్భిణీ స్త్రీలకు ఉచితముగా అన్ని రకముల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, బాల శ్వాస యోజన పథకము, కిషోర్ యోజన పథకం ,బేటీ పడావో బేటీ బచావో పథకము ద్వారా పిల్లలకు 18 లక్షల రూపాయల నగదు అందుతుందని ఉన్నత చదువులకు, వివాహములకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతుల అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వము కృషి చేస్తున్నదని, తల్లీబిడ్డల సంరక్షణకు ముఖ్యముగా బాలికల ఉన్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోషాఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమలతా దేవి, డాక్టర్ జీవన్ సంతోష్‌కుమార్, ఆర్ఎంఓ, ఎట మెహర్‌కుమార్, నర్సింగ్ సూపరిండెంట్ స్వర్ణలత బిజెపి నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవి కుమార్, 29వ వార్డు బీజేపీ అభ్యర్థి పల్లా చలపతిరావు, సి రాంబాబు ( నగరం యువ మోర్చా అధ్యక్షుడు), ఎన్. విజయ్ ఆనంద్ రెడ్డి, డి.శర్వాణి, సూరాడారాజు, ఈశ్వర్ వర్మ ,తులసి కుమార్ ,గేదెల శ్రీహరిపాల్గొన్నారు.



మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తూ మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఈ రోజు విశాఖ తూర్పు నియోజకవర్గంలో జోన్2 పరిధిలో ఉన్నటువంటి 15,16,17,18,19,21,22,23 వార్డులకు సంబంధించి 20వ వార్డులో చినవాల్తేర్ రజక వీధి సామాజిక భవనం లో వైఎస్ఆర్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మహిళా అధ్యక్షురాలు గరికినగౌరీ కూడా పాల్గొన్నారు.

**-వార్తావళి, విశాఖపట్నం, తూర్పు**

## పేద మహిళలకు సరుకులు పంపిణీ



**గాజువాక, వార్తావళి, సెప్టెంబర్ 15:** చైతన్య జ్యోతి ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గాజువాక పరిధిలో స్థానిక పేద మహిళలకు ఏ సీసీ పేట్... సి సి ఆఫీస్ వద్ద నిత్యావసర సరుకులు వంద మందికి బియ్యము పప్పులు ఆయిల్ మొక్కలు పేద మహిళ సరుకులు పంపిణీ చేశారు గ్రీన్ ఇండియా అధిక సాయం చేశారు లాక్ డౌన్ సమయంలో జీవనోపాధి కూలిపోయిన వారికి మాట్లాడారు అంతరం ప్రెసిడెంట్ ఆర్ రాజలక్ష్మి సెక్రెటరీ రాణి పర బాబి రాణి ఏసన్న భాగ్య కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల్లో ఏపీలో 13 నగరాలు



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13 నగరాలు కాలుష్యం బారినపడినట్లు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో వెల్లడించారు. రాజ్యసభలో వైయస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**ఏపీలోని ఈ 13 నగరాల్లో గాలి నాణ్యత శూన్యం**

2014–18 మధ్య దేశంలో వివిధ నగరాలలో గాలి నాణ్యతపై జరిపిన అధ్యయనంలో ఏపీలోని 13 నగరాల్లో కాలుష్యం పెరిగినట్లు తేలిందని మంత్రి తెలిపారు. అనంతపురం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నగరాల్లో స్వచ్ఛమైన గాలి నాణ్యత అత్యల్పంగా ఉన్నట్లు గుర్తించామని కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో తెలిపారు.

**ఇవే ప్రధాన కారణాలు..**

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌కాప్) కింద కాలుష్యం బారిపడిన నగరాల్లో కాలుష్యం వెదజల్లేందుకు ప్రధాన కారణాలను గుర్తించడానికి పలు అధ్యయనాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రోడ్లపై ఆవరించే ధూళి కణాలు, వాహన కాలుష్యం, చెత్త తగులబెట్టడం, నిర్మాణ, కూల్చివేత పనులు, పారిశ్రామిక కాలుష్యం వంటి నగరాలలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణంగా గుర్తించినట్లు కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో రాజ్యసభలో వివరించారు. ఈ నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపచ్చేందుకు నగరాల వారీగా ప్రణాళికలు రూపొందిస్తున్నన్లు కేంద్రమంత్రి తెలిపారు.

**2024 నాటికి 63లక్షలకుపైగా కుళాయి కనెక్షన్లు..**

ఇది ఇలావుండగా, జల జీవన్ మిషన్(జేజేఎం) కింద 2024 నాటికి గ్రామీణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు కుళాయి నీటి కనెక్షన్ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రమంత్రి రతన్ లాల్ కటారియా తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైసీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని 63లక్షల 72వేల ఇళ్లకు 2024 నాటికి కుళాయి కనెక్షన్ కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం వార్షిక ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రణాళిక కింద ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 31 లక్షల 93వేల ఇళ్లకు కుళాయి నీటి సదుపాయం కల్పించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి తెలిపారు. కరోనా కారణంగా జల జీవన్ మిషన్ పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఇప్పుడు అన్‌లాక్‌లో భాగంగా నిర్మాణ పనుల పునర్ ప్రారంభానికి కేంద్ర హోంశాఖ అనుమతించిన నేపథ్యంలో జల జీవన్ మిషన్ పనులను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు దేశంలో కోటి 32 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగడానికి రాష్ట్రాలకు తగిన నిధులు అందుబాటులో ఉంచినట్లు కేంద్రమంత్రి తెలిపారు.



వైస్సార్ ఆసరాలో భాగంగా 29వవార్డ్‌లో ఉన్న ప్రకాశరావు పేట, కన్నయ్యపేట, చందకవీధిలో మన ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వర్యులు వైస్ జగన్మోహన్‌రెడ్డికి, డ్వాక్రా మహిళలు అందరూ కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గురుంచి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఉరికిటి నారాయణ రావు గారు, కండిపల్లి సతీష్ గారు, చోలంగి శేఖర్ గారు,బులెట్ రవి గారు డోప్ప సూరి గారు, అరుగుల రాజు గారు, సారిపల్లి వెంకట రమణ గారు, ఉమ మహేష్ గారు ,చిన్నగారు,వార్డ్ మహిళ నాయకురాలు పల్లా రాధా లక్మి గారు, వార్డ్ నాయకులు, ఆర్. పి లు కార్యకర్తలు పాల్గొన్నారు.

**- వార్తావళి, విశాఖ దక్షిణం**

## విశాఖ గూఢచర్యం కేసులో మరొకరి అరెస్టు..

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 15:** 2019లో విశాఖపట్నం 'హనీట్రాప్' గూఢచర్యం కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మంగళవారం మరో వ్యక్తిని అరెస్ట్ చేసింది. గిటేలి ఇమ్రాన్ అనే వ్యక్తిని ఎన్ఐఏ గుజరాత్‌లో అదుపులోకి తీసుకుంది. ఈ వ్యక్తి పాకిస్తాన్ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్నట్టు ఎన్ఐఏ గుర్తించింది. విశాఖలోని నేవీ రహస్యాలను సేకరించేందుకు కుట్ర పన్నినట్లు తెలిపింది. ఈ క్రమంలో నేవీ సిబ్బందికి భారీగా ముడుపులు అందజేసినట్టు విచారణలో వెల్లడయినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో ఎన్ఐఏ 11 మంది నేవీ సిబ్బంది సహా మొత్తం 14 మందిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ సంఖ్య 15కు చేరింది. హవాలా మార్గాల్లో నేవీ సిబ్బందికి నిధులు సమకూర్చినట్టు సదరు వ్యక్తి దర్యాప్తులో వెల్లడించినట్లు ఎన్ఐఏ తెలిపింది. పాకిస్తాన్‌కు చెందిన కొందరు గూఢచారులు.. భారత నౌకలు, జలాంతర్గాముల లొకేషన్, ఇతర సమాచారాన్ని సేకరించేందుకు జూనియర్ స్థాయి నేవీ అధికారులను ట్రాప్ చేయడానికి ప్రయత్నించారు. ఇందుకుగాను సోషల్ మీడియా ద్వారా అందమైన యువతులను వారు ఎర వేసి.. వివరాలను కనుగొనేందుకు ప్రయత్నించారు.

## హోమ్ క్వారంటైన్‌లో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 15:** పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు గార్కి మరియు వారి కుమారుడు ముత్తంశెట్టి వెంకట శివ సాయి నందీ ష్ కు,, కరోనా సోకిన నందున ఇంటివద్దనే హెూమ్ క్వారంటైన్ లో ఉంటున్నారు. ఇంటివద్దనే చికిత్స తీసుకుంటున్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి తెలియ జేశారు .. కావున సందర్శకులు ఎవరు కలవడానికి రావద్దని కోరుతూ ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా వారిని ఫోన్ లో సంప్రదించవచ్చునని తెలిపారు.

## దశభుజ గణపతి ఆలయం, రాయదుర్గం



ఆ కళ్లు అచ్చంగా తండ్రి పోలికే, మూడుకన్నులతో ముక్కంటి బిడ్డ అనిపించుకున్నాడు. చేతులేమో అమ్మను తలపిస్తాయి, మహాశక్తిని గుర్తుకుతెచ్చేలా దశభుజాలు. మేనమామ లక్షణాలూ వచ్చాయి, విష్ణుమూర్తిలా చేతిలో సుదర్శనం. అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో వెలసిన దశభుజ గణపతి వైభవాన్ని చూడాల్సిందే! ఏనుగు మొహం, చాట చెవులు, బానపొట్ట... గణపతి రూపం జగద్విఖ్యాతం. అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో కొలువైన గజాననుడి రూపం మాత్రం కాస్త భిన్నంగా ఉంటుంది. మరుగుజ్జు స్వామి కాస్తా మహాకాయుడిగా దర్శనమిస్తాడు. పదిహేను అడుగుల ఎత్తుతో, పన్నెండు అడుగుల వెడల్పుతో ఉంటుందా విరాట్ మూర్తి. 'శుక్లాంబరధరం విష్ణుం...' శ్లోకం గణనాథుడిని లి'చతుర్భుజం'లి అని కీర్తిస్తుంది. కానీ, ఇక్కడి గణపతికి మొత్తం పదిచేతులుంటాయి. ఎడమవైపున అయిదు చేతులూ, కుడివైపున అయిదు చేతులతో... ఒక్కో చేతిలో ఒక్కో ఆయుధంతో – ఆ రూపం భక్తుల్ని తన్మయుల్ని చేస్తుంది. కుడివైపున... మొదటి చేతిలో నారికేళం, రెండో చేతిలో చక్రం, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో ధనుస్సు, ఐదో చేతిలో అంకుశం ఉంటాయి. ఎడమవైపున... మొదటి చేతిలో భార్య సిద్ధి, రెండో చేతిలో శంఖం, మూడో చేతిలో పవిత్రం, నాలుగో చేతిలో శరం, అయిదో చేతిలో ఖడ్గం దర్శనమిస్తాయి. విగ్రహం ఎడమ అరికాలి కింద అష్టదళ పద్మం ఉంది. ఇలాంటి స్వరూపాన్ని లి'మహాగణపతి'లి గా ఉపాసిస్తారు ఆధ్యాత్మిక సాధకులు. కాళ్లకు గజ్జెలూ, కాలికింద మూషిక వాహనమూ ముచ్చట గొలుపుతాయి. 'అచ్చంగా తండ్రిపోలికే...' అన్నట్టు ఫాలభాగంలో మూడో కన్ను ఉంటుంది. లి'ప్రసన్న వదనం'లి విషయంలో మాత్రం ఏమాత్రం తేడా లేదు. మహాచిద్విలాసంగా కనిపిస్తాడు.పదిచేతులవాడు కావడంతో 'దశభుజ గణపతి'గా పేరుతెచ్చుకున్నాడు. చేతలవాడు కూడా కావడంతో, కోరికల్ని సిద్ధింపజేస్తూ 'సిద్ధి వినాయకుడు' అనిపించుకుంటున్నాడు. స్వామి ముక్కంటిగా దర్శనమిస్తున్న కారణంగా, పరమశివుడిలానే దుష్టశిక్షకుడనీ శిష్టరక్షకుడనీ విశ్లేషిస్తారు. విగ్రహానికి కుడివైపున సూర్యుడూ ఎడమవైపున చంద్రుడూ ఉండటంతో విశ్వగణపతిగా కీర్తిస్తారు. చేతిలోని నారికేళ ఫలం సుఫలాలకు ప్రతీక. అందుకే భక్తులు, మొక్కులు మొక్కుకునే ముందు కొబ్బరికాయల్ని సమర్పిస్తారు. అభీష్టం సిద్ధించాక మళ్లీ వచ్చి, ఇంకొన్ని కాయల్ని నివేదిస్తారు.దశభుజ మహాగణపతి ఆలయాన్ని పద్నాలుగో శతాబ్దంలో భూపతిరాయలు అనే పాలకుడు నిర్మించినట్టు తెలుస్తోంది. ఆది, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. నెలనెలా సంకష్టహర చతుర్థికి వందలాది భక్తులు వస్తారు. పక్కనే నరసింహుడి ఆలయం ఉంది. ఇది కూడా రాయల కాలం నాటిదే. లక్ష్మీదేవి సమేతంగా కొలువైన ప్రహ్లాద వరదుడిని కళ్లారా దర్శించుకోవచ్చు. ఆలయాలకు అనుకుని ఉన్న కొండమీదికి మెట్ల మార్గం ఉంది. పైకి ఎక్కితే, శిథిల నగరం కనిపిస్తుంది. కొలనులూ రాజప్రాసాదాలూ విపణులూ గతవైభవ ఘనకీర్తిని వివరిస్తాయి.

**ఎలా చేరుకోవాలి???:** జిల్లా కేంద్రం అనంతపురానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉంది రాయదుర్గం. కర్ణాటకలోని బళ్లారి నుంచి అయితే యాభై కిలోమీటర్లు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006